కూటమిగా పనిచేద్దాం

ఎమ్మెల్సీని గెలిపిద్దాం

అభ్యర్థిని ప్రకటించేలోపు ఓటర్లను చేర్పిద్దాం

రాజమహేంద్రవరంలో రౌండ్ టేబుల్ మీటింగ్

7లో

వానొచ్చింది..



బందారులంకలో జోరువాన

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ముమ్మిడివరం మండలంలో అత్యధికంగా 105.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రాయవరంలో 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా మంగళవారం సగటున 51 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఆత్రేయపురంలో 28 మిల్లీమీటర్లు, మండపేట 22, రామచంద్రపురం 50.2, ఆలమూరు 25.4, రావులపాలెం 29.8, కొత్తపేట 34.2, కపిలేశ్వరపురం 29.4, కె.గంగవరం 62.8, ఐ.పోలవరం 101.4, అయినవిల్లి 73.4, పి.గన్నవరం 30.2, అంబాజీపేట 49.2, మామిడికుదురు 51.6, రాజోలు 45.6, మలికిపురం 48, సఖినేటిపల్లి 39, అల్లవరం 53, ఉప్పలగుప్తం 93.65, కాట్రేనికోన 71.2, అమలాపురం మండలంలో 62.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఉచిత డీఎస్సీ శిక్షణ

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జి.జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు. ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ పేద అభ్యర్థులు డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు పొందేందుకు ప్రభుత్వం ఉచిత శిక్షణను ఏర్పాటు చేసిందన్నారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఇస్తామన్నారు. టెట్ ఉత్తీర్ణులై ఉంటే వారికి స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించి ఆ పరీక్షలో 85 శాతం, టెట్‌లో పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజీని ఇచ్చి అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు లోపు మాత్రమే ఉండాలన్నారు. స్థానిక సచివాలయాల్లో ఆరు ప్రామాణిక అంశాలను పరిగణలోనికి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోచింగ్ ఎంపిక కోసం ఆన్‌లైన్ స్ర్కీనింగ్ టెస్ట్‌ను ఈ నెల 27న నిర్వహిస్తామని జ్యోతిలక్ష్మీదేవి తెలిపారు.

రూ.54 కోట్లతో 99 లింకు రోడ్లు

జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి



ఆలమూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తొమ్మిది వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల పరిధిలో రూ.54 కోట్లతో రైతులకు ప్రయోజనం కలిగే 99 లింకు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి తెలిపారు. ఈ ప్రతిపాదనలు ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించినట్లు వివరించారు. ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో రికార్డులు పరిశీలించడానికి విచ్చేసిన ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో ఆలమూరు, మండపేట, రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం, అంబాజీపేట, రాజోలు, నగరం, ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్‌ల పరిధిలో రూ.142.70ల ఆదాయం లభించిందన్నారు. ఈ నిధులతో లింక్ రోడ్లు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఏఎంసీ ద్వారా రైతుబంధు పథకం అమలు చేస్తున్నామని ఈ పథకం ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని ఏఎంసీల గోదాములలో నిల్వ చేసుకుంటే వాటిపై రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తూకం యంత్రాలు, తేమ శాతం తెలిపే మిషన్లను ఏఎంసీల ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తడిచిన ధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులకు బరకాలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా కొత్తపేట, రావులపాలెం, మండపేటలో రైతుబజార్లు విజయవంతంగా నడుస్తున్నాయని డీఏటీ విశాలాక్షి చెప్పారు. ఆలమూరు ఏఎంసీ కార్యదర్శి పీఎం గోవిందరెడ్డి పాల్గొన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

భర్త మృతి..భార్యకు తీవ్రగాయాలు

వార్త..7లో

మందు బాబులకు పండగ



కొత్తకొత్తగా..మద్యం వ్యాపారం

నేటి నుంచి మద్యం విక్రయాలు ప్రారంభం

బ్రాండ్ల అమ్మకాలకు ఏర్పాట్లు

ప్రారంభం కానున్న 133 షాపులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ మద్యం దుకాణాలు కాస్తా బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు కావడం, అలాగే ఇప్పటివరకు రకరకాల బ్రాండ్లను తాగి విసిగివేసారిపోయిన మందుబాబులకు కొత్త బ్రాండ్లు అందుబాటులోకి రానుండడంతో మందుబాబులకు పండుగ వాతావరణం మొదలైంది. గత ఐదేళ్లుగా అప్పటి వైసీపీ ప్రభుత్వంలో విక్రయించిన నాసిరకం మద్యం తాగిన వారికి ఇక ప్రముఖ బ్రాండ్లకు చెందిన మద్యం దొరకనుంది. దీంతో వారి ఆనందాలకు అవధుల్లేవు. దీనికితోడు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యం విక్రయాలు జరగనుండడంతో వారిలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని ఆరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో గల 133 మద్యం షాపులకు గాను 4078 మంది దరఖాస్తులు చేశారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రశాంతంగా లక్కీడ్రా నిర్వహించి విజేతల ఎంపిక పూర్తి చేశారు. దీంతో ఎంపికైనవారు సిండికేట్‌లతో చేతులు కలిపి వ్యాపార లావాదేవీల నిర్వహణకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా 133 మద్యం షాపులకు ఎంపికైన వ్యాపారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధరావతు సొమ్ములు చెల్లించే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం జిల్లాలో ఉన్న ఆరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో వ్యాపారులతో ఆయా కార్యాలయాలు కిటకిటలాడాయి. చలానాలు చెల్లించి ఎక్సైజ్ ఆఫీసులకు మద్యం వ్యాపారులు క్యూలు కట్టారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత వ్యాపారులకు అధికారికంగా మద్యం విక్రయాలకు సంబంధించి లైసెన్సులు జారీ కానున్నాయి. ప్రస్తుతం ఎక్సైజ్ ఆఫీసులు మద్యం వ్యాపారాలతో కిటకిటలాడుతున్నాయి. మరోవైపు షాపులు ఎక్కడ తీసుకోవాలనే దానిపై వ్యాపారులు దృష్టి పెట్టారు. ఎక్కువ విక్రయాలు జరిగే ప్రదేశాలను ఎంపిక చేసుకుని ఆయా ప్రాంతాల్లో మద్యం షాపులు తీసుకునేందుకు లాబీయింగ్‌లు చేస్తున్నారు. బుధవారం నుంచే మద్యం షాపుల్లో విక్రయాలు ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో అన్ని షాపుల్లోను అమ్మకాలు జరిగేలా ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

బ్రాండెడ్ మద్యం విక్రయాలు

ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతన మద్యం పాలసీ అమలులో భాగంగా జిల్లాలో గల 133 మద్యం షాపుల్లో ఇకపై ప్రముఖ కంపెనీల మద్యం అందుబాటులో ఉండనుంది. దీనిలో భాగంగా ఆయా కంపెనీలకు సంబంధించిన సరుకు ఇప్పటికే లిక్కరు డిపోలకు చేరుకున్నట్టు సమాచారం. ఎంసీ విస్కీ, ఐబీ, రాయల్‌స్టాగ్, రాయల్‌గ్రీన్‌లతో పాటు కింగ్‌ఫిషర్, 100 పైపర్స్ వంటి బీర్లు కూడా మద్యం షాపుల్లో అందుబాటులోకి రానున్నాయి. గతంలో భూమ్‌భూమ్ లాంటి పేర్లతో నాసిరకం బ్రాండ్‌లకు సంబంధించిన మద్యం విక్రయాలు ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విక్రయించారు. వీటిని తాగిన మద్యం ప్రియులు వేల సంఖ్యలో అనారోగ్యానికి గురైనవారు కొందరైతే మృత్యువాత పడ్డవారి సంఖ్య కూడా అదే రీతిలో ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ నూతన పాలసీ విధానంలో భాగంగా బ్రాండెడ్ కంపెనీల మద్యం విక్రయించాలన్న నిర్ణయం పట్ల మద్యం ప్రియులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అచ్చెన్నాయుడు

మంత్రి సుభాష్ కృష్ణా జిల్లాకు..





(అమలాపురం-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును నియమించారు. గతంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి, సీనియర్ మంత్రిగా అనుభవం ఉన్న అచ్చెన్నాయుడుకు కోనసీమ జిల్లా పరిధిలోని కూటమి నేతలతో మంచి సంబంధాలు కలిగి ఉన్నాయి. ఆయనను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించడం పట్ల టీడీపీ జిల్లా నాయకులతో పాటు జనసేన, బీజేపీ నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అచ్చెన్నాయుడు నేతృత్వంలో జిల్లా మరింత పురోభివృద్ధి చెందాలని ఈ ప్రాంత వాసులు ఆకాంక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా రామచంద్రపురం ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కృష్ణాజిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ప్రభుత్వం నియమించింది. జూనియర్ మంత్రిగా ఉన్న సుభాష్‌ను రాష్ట్రంలో అత్యంత క్లిష్టమైన కృష్ణాజిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం పట్ల ఆయన వర్గీయులు సుభాష్ సమర్థతపై సంతృప్తి తెలియజేసి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యాన పంటలకు ఊతం



ఉపాధి హామీ పథకంలో

మూడేళ్ల పాటు ప్రోత్సాహం

14 రకాల మొక్కల పెంపకానికి

రైతులకు సాయం

జిల్లా వ్యాప్తంగా 1204

ఎకరాల్లో సాగు

పి.గన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో రైతును కూడా అన్ని విధాల అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రాయితీలతో కూడిన సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. పంట కాలంలో వారికి తోడుగా ఉండి ఫలసాయం చేతికి వచ్చే వరకు వారికి సహకారం చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ క్రమంలోనే మరుగున పడుతున్న ఉద్యాన పంటలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉచితంగా పథకాన్ని అమలు చేస్తుంది. కొబ్బరి మొక్కలతో పాటు కొబ్బరి తోటల్లో అంతర పంటలకు గాను రైతులకు అదనపు ఆదాయం పెంపొందించడానికి ఉపాధి హామీ పథకంలో కార్యాచరణ చేపట్టింది. మొక్క నుంచి నిర్వహణ నిమిత్తం మూడేళ్ల పాటు రైతుకు వివిధ రూపాల్లో ఉచితంగా పథకాన్ని అమలు చేస్తుంది. రైతులకు ఉన్న ఆసక్తిని బట్టి 14 రకాల పండ్లు, పూలతోటలు పంటలను సాగుచేసేలా రైతులను సన్నద్ధం చేస్తుంది.

ఈ పథకానికి అర్హతలు..

సన్న, చిన్నకారు రైతులు (2.50 ఎకరాలు పల్లం లేదా 5 ఎకరాలు మెట్ట భూమి కలవారు) మాత్రమే ఈ పథకానికి అర్హులు, భూసార పరీక్షలు ద్వారా సిఫార్సు చేయబడిన భూములు ఉండాలి, ఏవిధమైన కోర్టు కేసులు లేకుండా భూమికి పట్టాదారు పాసుబుక్ కలిగి ఉండాలి, సంబంధిత రైతు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండాలి, మొక్కలు పెంచడానికి నీటి వసతి పూర్తిస్థాయిలో ఉండటంతో పాటు కనీసం 50 సెంట్లు భూమి ఒకేచోట ఉండాలి.

అనుమతించిన పంటలు..

ఈ పథకంలో 14 రకాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వాటిలో మామిడి (మూడేళ్లకు రూ.1,09,949), జీడిమామిడి (మూడేళ్లకు రూ.99,684), బత్తాయి (మూడేళ్లకు రూ.1,37,749), జామపండు (మూడేళ్లకు రూ.1,46,970), కొబ్బరి (మూడేళ్లకు రూ.99,181), సపోటా (మూడేళ్లకు రూ.93,340), చింత (మూడేళ్లకు రూ.68,403), పామాయిల్ (మూడేళ్లకు రూ.47,200), సీతాఫలం (మూడేళ్లకు రూ.2,14,178), తైవాన్‌జామ (మూడేళ్లకు రూ.2,51,223), మునగ (మూడేళ్లకు రూ.27,515), పూలతోటలు (మూడేళ్లకు రూ.62,355), డ్రాగన్‌ఫ్రూట్స్ (మూడేళ్లకు రూ.2,00,715), నిమ్మ (మూడేళ్లకు రూ.1,46,309) పంటలకు మూడేళ్ల పాటు సాగు నిమిత్తం మొక్కలు కొనుగోలు, రవాణా దగ్గర నుంచి సంరక్షణ, ఎరువులు కొనుగోలు వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారానే నిబంధనలు అనుసరించి ప్రభుత్వం సంబంధిత రైతుకు చెల్లిస్తుంది.

మూడేళ్ల పాటు సాగు....

ఈ పథకం ద్వారా ఉద్యాన పంటను సాగు చేసే రైతుకు వివిధ రూపాలలో ప్రభుత్వం సొమ్ము చెల్లిస్తుంది. మొదటగా మొక్క కొనుగోలు, రవాణా నిమిత్తం ఎకరాకు సుమారు 4 వేలు (మొక్క రేటును బట్టి నగదు మారుతుంది) చెల్లిస్తారు. మొక్క నాటే నిమిత్తం గుంతలు తీసుకోవడానికి జాబ్ కార్డు ద్వారా కూలీ రూపంలో ఆయా మొక్కలను బట్టి నగదు రైతు ఖాతాల్లో జమ చేస్తుంది. అలాగే అంతర పంటల్లో దుక్కు నిమిత్తం మొదటి, రెండో సంవత్సరాల్లో రూ.2216 చెల్లించనున్నారు. అదే విధంగా మొక్క సంరక్షణ నిమిత్తం నెలలో మూడు పని దినాలకు సంబంధించి రూ.900 జాబ్‌కార్డు ద్వారా చెల్లించనున్నారు. మొక్కకు నీళ్లు పోసుకోవడానికి ప్రతి ఏడాది అక్టోబరు నెల నుంచి మార్చి నెల వరకు ఎనిమిది నెలలు పాటు నెలకు మూడు పనిదినాలు రూ.900ను జాబ్‌కార్డు ద్వారా చెలిస్తారు. వర్మీ కంపోస్టు తరహా ఎరువులు మూడేళ్ల పాటు సంవత్సరానికి రూ.1750 రైతు ఖాతాలో జమ చేస్తారు. అంతే కాకుండా ప్రతి నెల సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు మొక్కల స్థితిగతులను పరిశీలిస్తారు. ఇలా...14 రకాల ఉద్యాన పంటల రైతులకు జీరో సబ్సిడీతో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుంది.

520 ఎకరాల్లో పండ్ల తోటల సాగు

డ్వామా పీడీ ఎస్.మధుసూదన్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1204 ఎకరాల్లో 14 రకాల ఉద్యాన పంటలు సాగు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సూచించింది. అయితే ప్రస్తుతం 871 ఎకరాలకు ప్రభుత్వం మంజూరు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 439 మంది రైతులు 520 ఎకరాల్లో బత్తాయి, జామ, కొబ్బరి, నిమ్మ, గులాబీ, జీడిమామిడి సాగు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాన్ని జాబ్ కార్డు ఉన్న ఉద్యానవన రైతులు వినియోగించుకోవాలి. కొబ్బరి తోటల్లో అంతర పంటలకు అవకాశం ఉన్నందున రైతులకు అదనపు ఆదాయం వస్తుంది.

ద్వారపూడి పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సుబ్రహ్మణ్య కాంప్లెక్స్ అవినీతే కారణమా?

మండపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీలో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో పాలకవర్గం అవినీతికి పాల్పడిందన్న ఆరోపణలతో పాటు పంచాయతీ బైలాను అమలు చేయకుండా పాలకవర్గం ఇష్టానుసారం వ్యవహరించిన తీరును అధికారులు తప్పుబట్టారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారి దర్యాప్తు చేయగా అవకతవకలు జరగడాన్ని గుర్తించారు. ఇందులో భాగస్వాములు అయిన సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేయటంతో పాటు అప్పట్లో ఇక్కడ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన ఇద్దరు కార్యదర్శులకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సర్పంచ్, ఉప సర్పంచ్.. గతంలో ఇక్కడ పనిచేసి మరో చోటుకు బదిలీ అయిన ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం దుకాణ సముదాయం నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ప్రతిపాదనలు తయారు చేయాలి కానీ అలా జరగలేదు. పాలకవర్గం కనుసన్నల్లో దుకాణ సముదాయం పనులు చేపట్టి పూర్తి చేశారు. దీంతో పాటు షాపుల నిర్మాణం కోసం లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేశారు. ఈ మేరకు పాలకవర్గం వ్యవహార తీరు వల్ల పంచాయతీకి తీవ్రనష్టం కలిగిందని నివేదికలో వెల్లడించారు. దీంతో నిబంధనలను అనుసరించి గ్రామ సర్పంచ్ ఈతకోట కిన్నెర చెక్‌పవర్‌ను మూడు నెలల పాటు రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దుచేసిన నేపథ్యంలో ప్రస్తుతం మండపేట మండల ఈవోపీఆర్‌డీ దాసరి శ్రీనివాస్‌కు చెక్‌పవర్‌ను ఇచ్చారు. అప్పటిలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శుల పాత్రపై కూడా విచారణ అనంతరం చర్యలు తప్పకపోవచ్చని తెలిసింది. ఇదిలా ఉండగా వైసీపీకి చెందిన సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ కోసం రాజకీయ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది..



వారాహిగా దర్శనమిస్తున్న శ్రీదేవి అమ్మవారు..

వారాహిగా శ్రీదేవి అమ్మవారు

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారు భక్తులకు వారాహిదేవిగా దర్శనమిచ్చారు. వారాహి అలంకరణలో ఉన్న అమ్మవారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. కల్వకొలను వీధి వేపచెట్టు అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. లడ్డూ వేలం పాటను నిర్వహించగా పిండి నానాజీ లడ్డూను దక్కించుకోగా అమ్మవారి మెడలో పూజలు అందుకున్న రూ.5 నాణేల దండను డాక్టర్ రాజా దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కల్వకొలను తాతాజీ, దున్నాల దుర్గ, ఆలయ కమిటీ సభ్యులు బోనం శ్రీను, యేడిద శ్రీను, బోనం అప్పారావు, కల్వకొలను బుజ్జి, దున్నాల వేణు, పడాల బాబు, కొల్వకొలను ఉమ తదితరులు పాల్గొన్నారు.

రీచ్‌ల్లో నీటి ప్రవాహంతో ఇసుక వెలికితీతకు అవరోధం

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో రీచ్‌ల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ఇసుక వెలికితీతకు తాత్కాలిక అవరోధం ఏర్పడిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఇసుక ర్యాంపుల వద్ద ఇతర ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత పాలసీ విధానం అమలులోకి వచ్చినందున ఎటువంటి అపోహలకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ గనులు, భూగర్భశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లకు సూచించారు. అమరావతి నుంచి మంగళవారం మీనా ఉచిత ఇసుక నిర్వహణ విధాన సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి కలెక్టర్లు, జేసీలకు దిశానిర్దేశం చేశారు. నదుల్లో నీటి ప్రవాహం తగ్గే అవకాశం ఉన్నచోట్ల స్టాకు యార్డులను, ఓపెన్ రీచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భవన నిర్మాణ రంగానికి ఎటువంటి కొరత లేకుండా ఉచిత ఇసుక సరఫరా జరగాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్‌తో పాటు కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు అశోక్‌కుమార్, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ మహేష్

అక్షరాస్యత మెరుగుకు ఉల్లాస్..

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్లు పైబడిన స్వయం సహాయక సంఘ నిరక్షరాస్య మహిళలు, పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వంట పనివారలు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్‌లు, అంగన్‌వాడీ ఆయాలకు ఆర్థిక ఫంక్షనల్, డిజిటల్ అక్షరాస్యతను నేర్పించే దిశగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 7,128 మందిని ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. జిల్లాలో ఆలమూరు, కపిలేశ్వరపురం, కాట్రేనికోన, ఆత్రేయపురం, రావులపాలెం, రాయవరం, ఐ.పోలవరం, కె.గంగవరం, మండపేట మండలాల్లో తక్కువ అక్షరాస్యత కలిగిన మండలాలుగా గుర్తించామన్నారు. ఆయా మండలాల్లో నిరక్షరాస్యులకు పాఠాలు బోధించేందుకు వలంటరీ టీచర్లను, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీవోఏలను ఎంపిక చేస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఆరు నెలల కాల వ్యవధిలో ఉల్లాస్ కార్యక్రమాలు నిర్వహించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యా అధికారి పి.పోశయ్య, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీఈవో ఎం.కమలకుమారి, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, డీపీవో శాంతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మీది..'మంచి' ఆహారమేనా..

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

మనకున్న ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి దిక్సూచి. ఏం తింటున్నాం, ఎలా తింటున్నాం, ఎంత తింటున్నాం.. ఈ విషయాలే మంచి ఆరోగ్యానికి పునాది వేస్తాయి. కొవిడ్ తర్వాత.. చాలామందిలో ఆహారపు అలవాట్లు మారాయి. పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం అధికమైంది. నాణ్యమైన ఆహారం స్వీకరించాలనే అభిరుచి పెరిగింది. అవకాశం ఉన్నవాళ్లు సేంద్రియ ఉత్పత్తులను ఎంచుకొని మరీ ఆహారంగా ఎంచుకుంటున్నారు. మిగిలినవాళ్లు నాణ్యమైన ఉత్పత్తులో కాదో తెలుసుకుని, ఆరా తీసి సదరు ఆహార ఉత్పత్తులను కొంటున్నారు. అదే సమయంలో ప్రజల ఆహారపు అభిరుచులు, అలవాట్లను వ్యాపారంగా మలుచుకుని నకిలీ ఆహార ఉత్పత్తులను వారికి అంటగట్టే మాయాజాలం పెరిగిపోయింది. అవి కల్తీ ఉత్పత్తులో కాదో తెలియనంత మోసం... వాటిని నియంత్రించాల్సిన వ్యవస్థలు చురుకుగా ఉంటేనే నాణ్యమైన ఆహారం ప్రజలకు లభిస్తుంది. నాణ్యతను పరీక్షించే వ్యవస్థలదే ఈ బాధ్యత. మరోవైపు రైతులు సేంద్రియ ఉత్పత్తులను అందించి ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలవాలని పెద్ద కృషే చేస్తున్నారు. మన ప్రాంతంలో మంచి ఆహారం అందించేందుకు జరుగుతున్న కృషిపై ప్రత్యేక కథనం.



కాలబట్టి వరి ధాన్యం



నవారా ధాన్యం





ప్రకృతి సాగులో పొలం గట్లపై అరటి, కొబ్బరి చెట్ల పెంపకం..

(పక్కన) ప్రకృతి సహజ సాగు కోసం జీవామృతం తయారీ

చిరుధాన్యాలతోనే జీవనం!

పోడు భూముల్లో చిరుధాన్యాలు పండిస్తున్న కొండరెడ్లు



చింతూరు మండలం రత్నాపురంలో లైన్ షోయింగ్ పద్ధతిన వరి సాగులో కలుపు నివారణ చర్యలు



అడవుల్లో పండిస్తున్న జొన్న పంట

కూనవరం (ఆంధ్రజ్యోతి): కొండరెడ్లు.. బాహ్య ప్రపంచానికి ఎక్కడో దూరంగా ఉండి జీవిస్తుంటారు. అడవుల్లో తలదాచుకునే వీరు పోడు భూమి వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తారు. వీరి ముఖ్య పంట చిరుధాన్యాలు. కూనవరం మండలంలోని గుట్టలపై కారుమానుకొండ, గబ్బిలాల గొంది, కోపిరిమెట్ట, బావిబొక్క, ఎరుగుమామిడిగొంది తదితర గ్రామాల కొండరెడ్ల ప్రజలు నివాసముంటున్నారు. వారు అక్కడ గుట్టలపై భూములు చదును చేసుకుని పంటలు పండిస్తారు. జొన్న, సాములు, కొర్రలు వీరి ముఖ్య పంటలు. ఈ పంటలను వర్షాధారం మీదే సాగు చేస్తారు. పండించిన పంటల్లో ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడరు. పండిన చిరుధాన్యాల పంటలను తమ కుటుంబ పోషణకు కొద్దిగా ఉంచుకుని మరికొంత చిరుధాన్యాలను సంతల్లో అమ్ముకుంటున్నారు.

ప్రకృతి సాగుతో సురక్షిత ఆహారం

ఆ దిశగా అడుగులు వేస్తున్న ఆదివాసీ రైతులు... 11 వేల ఎకరాల్లో సాగు

చింతూరు (ఆంధ్రజ్యోతి) : కాంప్లెక్స్ ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగంతో భూసారం నానాటికి క్షీణిస్తోంది. అదే దశలో మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వివిధ రుగ్మతలకు రసాయనిక ఎరువులతో పండించిన పంటలే కారణమని వైద్యులు సైతం హెచ్చరిస్తుంటారు. దీంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని రైతు సాధికారిత సంస్థ ప్రకృతి సాగుపై దృష్టి సారించింది. ఆ దిశగా రైతుకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఒక్క చింతూరు డివిజనులోనే 8500 మంది ఆదివాసీ రైతులు 11 వేల ఎకరాల్లో ప్రకృతి సాగుకు ఈ ఏడాది శ్రీకారం చుట్టారు. వీటిలో వరితోపాటు కూరగాయలు, అపరాల సాగు కూడా ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్న రైతులు వారే స్వయంగా సేంద్రియ ఎరువులను అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకుంటున్నారు. వీటిలో భూసారం పెంచే ఎరువుతోపాటు పురుగు నివారణ, అధిక దిగుబడి సాధించే ఎరువులు సైతం ఉన్నాయి. విత్తన శుద్ధికోసం బీజామృతం, పంట ఎదుగుదల, అధిక దిగుబడి, పురుగు నివారణ కోసం ఘనజీవామృతం, ద్రవజీవామృతం, నీమాస్త్రం వంటి కషాయాలను రైతు ఇంటి వద్దనే తయారు చేసుకుంటున్నారు. సేంద్రియ ఎరువు తయారు చేసుకోనేందుకు సెనగపిండి, ఎల్లుల్లి, మిర్చి, బెల్లం, పుట్టమట్టి. ఆవు మలమూత్రాలను వినియోగిస్తున్నారు. ఇవన్నీ తక్కువ వ్యయంతోపాటు అందుబాటులో లభ్యమయ్యేవే. మరోవైపు రోజురోజుకి పెరుగుతున్న సాగు వ్యయం రైతుని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కూలీల కొరత వ్యవసాయానికి పెద్ద లోటుగా మారింది. దీంతో అధిక దిగుబడులు సాధిస్తే గాని రైతు గట్టెక్కలేని పరిస్థితి ఉంది. లేదంటే అప్పుల ఊబిలో కూరుకపోక తప్పదు. చేసేదేమి లేక నష్ట నివారణలో భాగంగా హైబ్రిడ్ వంగడాలు, కాంప్లెక్స్ ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం వైపు రైతు మళ్లాల్సి వస్తోంది. అయితే ఈ తరహా సాగు మానవాళి ఆరోగ్యంపై పడుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకృతి సాగు దిశగా రైతులను మళ్లిస్తోంది.

కృషీవలుడు జిత్తుగ శ్రీనివాస్

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి) : అధిక దిగుబడుల కోసం రైతులు హైబ్రీడ్ రకాలతోనే వరిసాగు చేస్తున్నారు. ఈ రకాల సాగులో ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. హైబ్రిడ్ రకాల బియ్యం తింటే ఆ ప్రభావం ఆరోగ్యంపై పడుతోంది. ఇలా అందరూ ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తుంటే.. ఓ యువ కౌలురైతు మాత్రం పురాతన కాలంనాటి దేశవాళీ వంగడాలను సాగులోకి తెస్తున్నారు. గత ఏడేళ్లుగా ఈయన కృషి సాగిస్తూ వస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన యువ కౌలురైతు జిత్తుగ శ్రీనివాస్. 2012 నుంచి 2017 వరకు ఎక్కువ శాతం సేంద్రియ ఎరువులు, వర్మికంపోస్టు యూనిట్, జీవన ఎరువులు, వేపపిండి, వేపనూనె తదతర ఉత్పత్తులతో వరిలో హైబ్రిడ్ రకాలను పండించేవారు. 2017లో అప్పటి ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటుచేసిన పాలేకర్ ఇచ్చిన శిక్షణలో పాల్గొని అప్పటి నుంచి ఏటా పలు దేశవాళి రకాలను పరిచయం చేస్తూ వస్తున్నాడు. ఇప్పటివరకు పది దేశవాళి రకాలతోపాటు రెండు హైబ్రిడ్ రకాలను ఈ పద్ధతుల్లోనే పండించారు. మొదటి ఏడాది ఒక ఎకరం పొలంలో ఐదు నుంచి ఆరు రకాలను పండించేవారు. క్రమేణా పది సెంట్ల పొలాన్ని ఎంచుకుని రెండు నుంచి మూడు రకాలను మాత్రమే పండిస్తున్నారు. పండించిన ధాన్యాన్ని మొదట్లో గిట్టుబాటు ధరకు అందించేవారు. కొంతకాలం తరువాత తన అవసరాలకు ఉపయోగించుకుని అనంతరం బంధువులకు పంచుతున్నారు. ఇప్పటివరకు ఆయన పండించిన వరి దేశవాళీ రకాలు.. కాలబట్టి, దూదేశ్వర్, ఇల్లపూసాంబ, తులసి భాసో, మైసూర్ మల్లిగా, కుళ్ళాకార్, చిట్టిముత్యాలు, నవారా నల్లబియ్యం.

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని రకాలు పండిస్తా

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని రకాలు పండిస్తాను. ఇప్పటివరకు 10 దేశవాళీ, రెండు హైబ్రిడ్ రకాలు ప్రకృతి సేద్యం పద్ధతిలో పండించాను. వరిలో ప్రపంచంలో 10 వేల దేశవాళీ రకాలు ఉంటే వివిధ రాష్ట్రాల్లో 120 రకాలు వరకు పండిస్తున్నారని తెలుసుకున్నాను. ఈ రకాలన్నీ ప్రస్తుతం ఉత్పన్నమవుతున్న ఆరోగ్య సమస్యలను కట్టడి చేస్తాయి. అయితే ఈ రకాలపై సరైన అవగహన లేక మార్కెట్‌లో డిమాండ్ లేదు. ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తే పంటలు పండించొచ్చు.

- జిత్తుగ శ్రీనివాస్, కౌలురైతు, పోతవరం



తిండి కూడా తెలుసుకోవాల్సిందే

- 2014లో జేఎన్టీయూకేలో ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీ ఏర్పాటు
- ఆహార పదార్థాల నాణ్యతా పరీక్షలకు రాష్ట్రంలో ఇదొక్కటే కేంద్రం





జేఎన్‌టీయూకేలో ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ

జేఎన్టీయూకే (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ప్రతీ ఒక్కరిలో తినే ఆహార పదార్థాల నాణ్యతపై శ్రద్ధ పెరిగింది. ముఖ్యంగా ఆహార నాణ్యతపై అవగాహనతోపాటు వాటి ప్రమాణాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీనికోసం దేశంలో 232 ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీలుండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడు ఉండేవి. అయితే తెలంగాణ విడిపోయిన తరువాత విభజిత ఏపీలో ఒక్క ల్యాబ్ కూడా లేకపోవడంతో కాకినాడ జేఎన్టీయూకేలో 2014లో ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీని ఏర్పాటుచేశారు. ఆహార ఉత్పత్తుల పరీక్ష అనేది చాలా ముఖ్యం. దీనివల్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పర్యవేక్షించబడతాయి. ఆహారంలో భౌతిక, రసాయనిక, జీవసంబంధమైన ప్రమాదాలు లేవని నిర్ధారించడానికి ఈ పరీక్ష అవసరం. అంతేకాకుండా ఆహారంలోని శాస్త్రీయ విశ్లేషణను తెలియజేస్తుంది. కంటికి కనిపించని లోహాలు, ఎశ్చరీషియా కోలై బ్యాక్టీరియా, సాల్మోనెల్లా, క్లీనింగ్ ఏజెంట్లు, సంకలనాలు, పురుగు మందులు వంటి వాటిని ఈ పరీక్షల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. రోజురోజుకు పెరుగుతున్న మానవ వనరుల ఆవశ్యకతను గుర్తించి జేఎన్టీయూకేలో విశ్రాంత ప్రొఫెసర్ పి.రామకృష్ణ సూచనలు, సలహాలతో 2010-11లో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీని ప్రారంభించి ఫుడ్‌ప్రాసెసింగ్ టెక్నాలజీలో రెండేళ్ల కాల వ్యవధి గల ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టారు. అదేవిధంగా 2020-21లో ఫుడ్ ఇంజనీరింగ్‌లో బీటెక్ కోర్సును ప్రారంభించారు. 2014లో ఐదుగురు సభ్యులతో పరీక్ష శాలను ఏర్పాటుచేయగా దేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ అర్హత కలిగిన ఆహార విశ్లేషకులు 132 మంది ఉండగా రాష్ట్రంలో ఏడుగురు మాత్రమే ఉన్నారు. వారిలో కె.విజయలక్ష్మి, మరో ఐదుగురు ల్యాబ్ సైంటిస్టులు ఇక్కడ సేవలందిస్తున్నారు. ఎగుమతి తనిఖీమండలి(ఈఐసీ), అగ్రికల్చర్ ప్రొడ్యూస్ ఎక్స్‌పోర్ట్ డవలప్‌మెంట్ అథారిటీ నుంచి గుర్తింపు పొందిన తరువాత సీఫుడ్, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, తృణధాన్యాలు, పప్పులు, హెవీ మెటల్స్ లోని యాంటీబయాటిక్స్‌ను పరీక్షించే అవకాశముందని స్కూల్ ఆఫ్ ఫుడ్‌టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ తెలిపారు. అదేవిధంగా దిగుమతి చేసుకున్న నూనెలను కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి నాణ్యతను విశ్లేషించడానికి తమకు వస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు లైసెన్స్ జారీ చేసే ముందు ఆహార నమూనాలను విశ్లేషణ కోసం పంపిస్తే వాటిని పరీక్షిస్తామన్నారు. 2014 నుంచి ఇప్పటివరకూ సుమారు 4200 పరీక్షలు నిర్వహించి ఆమోదాన్ని తెలిపామన్నారు.



డాక్టర్ మాలోతు రమేష్

ఎవరైనా పరీక్ష చేయించుకోవచ్చా..

వర్సిటీలో ఏర్పాటుచేసిన ఫుడ్‌టెస్టింగ్ ల్యాబ్‌లో ప్రజలు సైతం నామమాత్రపు రుసుం నిబంధనల ప్రకారం చెల్లించి తమకు సందేహాలున్న వాటిని తనిఖీ చేయించుకునే అవకాశముంది. పిల్లలు తాగేపాలు, మంచినీటి దగ్గర నుంచి నెయ్యి, వంట నూనె, తినే కూరగాయలు, వాటిని పండించేందుకు వాడే రసాయనాలు, క్రిమిసంహారక మందులు ఇలా అన్నింటినీ తనిఖీచేసి వాటి నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే అవకాశముంది. ఏపీలో ఏకైక ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫాస్టాక్ ట్రైనింగ్ పార్టనర్‌గా గుర్తింపు పొందిన సంస్థ జేఎన్టీయూకే అని డాక్టర్ మాలోతు రమేష్ తెలిపారు.

కాదేదీ కల్తీకనర్హం

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి): అన్ని చోట్లా ఆహారం, ఆహార దినుసులు కల్తీ అవుతూనే ఉన్నాయి. ఫస్ట్ క్వాలిటీ, సెకండ్, థర్డ్ క్వాలిటీ అనే పదాలు ఎప్పుడో పుట్టుకొచ్చేశాయి. అయితే ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూనే ఉన్నా.. పూర్తిగా రోజూ పరిశీలించడం సాధ్యమయ్యే పనికాదు. తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకూ హోటల్స్, రెస్టారెంట్లు, బార్లు, కిరాణా, ఐస్‌క్రీం ఫ్యాక్టరీలు తదితర చోట్ల 123 నమూనాలను సేకరించారు. వాటిని నాచారంలోని స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి పంపించారు. వాటిలో 39 నమూనాలు పరీక్షలో విఫలమయ్యాయి. నాణ్యత లేకపోవడం, బ్రాండ్ పేరు సరిగా లేకపోవడం, వంటనూనె ప్రమాణాల్లో బేధాలు, గడువు ముగిసిన వాటిని విక్రయిస్తుండడం వంటివి వాటిలో ఉన్నాయి. వీటి ఆధారంగా కేసులు నమోదు చేయనున్నారు. ఇక ఆహార పదార్థాల విషయంలో ఏదైనా ఫిర్యాదు చేయాలంటే ఎవరికి చేయాలో తెలియని పరిస్థితి ఉంది. గతంలో ఉమ్మడి జిల్లాలో ఒక ఫోన్ నంబరు ఉండేది. కానీ ఇప్పుడు అది పనిచేయడం లేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ వెబ్‌సైట్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకోవాల్సిందే. అలాకాకుండా ప్రతి చోటా సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు డిస్‌ప్లే చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. దైనందిన జీవనంలో రోజు వారీగా కొన్ని ఆహార పదార్థాలు వంటల్లో ఉండాల్సిందే. కానీ అన్నీ కల్తీనే. కందిపప్పులో కేసరి పప్పు, ధనియాల పొడిలో ఉప్పు, పసుపులో లెడ్‌క్రోమెట్ మిరాయి రంగు, నూనెల్లో ఆముదం, ఆవ నూనెలో ఆర్జిమోన్ నూనె, గసగసాల్లో తోటకూర గింజలు, పాలల్లో బియ్యపు పిండి వంటివి కలిపేస్తున్నారు. వీటివల్ల ఆర్థిక నష్టమే కాకుండా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తనిఖీల కోసం మూడు బృందాలు

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి): మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి ముఖ్యమైనది నాణ్యమైన ఆహారం. రాజమహేంద్రవరంలో ప్రజలకు, పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా హోటల్స్, రెస్టారెంట్లను అప్రమత్తం చేసేందుకు నగరపాలక సంస్థ కసరత్తు చేస్తోంది. చారిత్రక రాజమహేంద్రవరం కీర్తికి ఎటువంటి మరక అంటకూడదనే ఆలోచనతో కమిషనర్ కేతన్‌గార్గ్ నగరంలో పబ్లిక్ హెల్త్‌విభాగం నుంచి మూడు ఫుడ్ సేఫ్టీ బృందాలను ఏర్పాటుచేశారు. గతంలో నగరంలో ఆహార నాణ్యత విషయంలో సమస్యలు ఉండేవి. ఇటీవల కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ బృందాల తనిఖీలు ముమ్మరం చేయడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. హోటళ్లు, రెస్టారెంట్లలో వంటశాలలను తనిఖీలు చేసి అక్కడ వినియోగించే పరికరాలు, ఆహార తయారీకి వినియోగించే సరుకులు, నిల్వచేసిన ఆహారాలపై తరచు తనిఖీలు చేస్తున్నారు.

నాణ్యమైన ఆహారం అందివ్వాలనే ఉద్దేశంతో..

పెరవలి (ఆంధ్రజ్యోతి) : తమ కుటుంబంతోపాటు గ్రామస్తులకు కూడా ఎటువంటి పురుగు మందులు అవశేషాలు లేని నాణ్యమైన ఆహార ధాన్యాలు అందించాలనే ఉద్దేశంతో పెరవలి మండలం తీపర్రుకు చెందిన అభ్యుదయ రైతు కంటిపూడి సూర్యనారాయణ గత పదేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం బాట పట్టారు. తనకున్న రెండు ఎకరాల భూమిలో ఎటువంటి ఎరువులు పురుగు మందులు వాడకుండా ఉన్నారు. ఆకుమడి లగాయతు కోత కోసే వరకు కేవలం వివిధ రకాల ఆకుల కషాయం, పశువుల పేడ, ఆవు మూత్రంతో తయారుచేసిన వివిధ రకాల ద్రవాలను పంటలపై వెదజల్లుతూ భూమిపై వేస్తూ వరిని సాగు చేస్తున్నారు. ఎకరానికి 25 బస్తాలు వరకు దిగుడి వస్తోందన్నారు. తానే సొంతంగా మిల్లులకు తీసుకెళ్లి వాటిని మర ఆడించి 25 కిలోల బస్తాలుగా ప్యాక్ చేయించి తక్కువ ధరకే స్థానిక ప్రజలకు విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో 25 కిలోల బియ్యం బస్తా 1300 అమ్మేవాడినని, ప్రస్తుతం గిట్టుబాటు కాకపోవడంతో 1500 విక్రయిస్తున్నట్టు చెప్పారు. వరి కోసిన అనంతరం ఇదే భూమిలో కూరగాయలు కూడా పండిస్తానని తెలిపారు. ఇదే తరహా పంటలనే పండించాలని అనుకున్నట్టు చెప్పారు.





రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో మంత్రులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రానికి ఊపిరిపోశాం!

120 రోజుల్లో ఆక్సిజన్ అందించాం

జగన్ రాజకీయాలకు అనర్హుడు

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

రాజమహేంద్రవరం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సుమారు 120 రోజుల్లో ఏమి చేసిందో నాకు తెలుసు. 5 కోట్ల ఆంధ్రులకూ తెలుసు. కొందరు ఏమి చేశారని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. మేము అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వం వెంటిలేటర్ మీద ఉంది. అటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని ఇప్పటికే ఆక్సిజన్ పీల్చుకునే స్థాయికి తీసుకొచ్చాం' అని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ అండ్ మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తూర్పుగోదావరి రాజమహేంద్రవరంలోని మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందన్నారు. ప్రకృతి సంపదను జగన్ దోచేసుకున్నాడని ధ్వజమెత్తారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆంధ్రులు జగన్‌ని తరిమికొట్టి కూటమిని గెలిపించారన్నారు. ఈ 120 రోజుల్లో రూ.3 వేల పింఛన్‌ను రూ.4వేలు చేశామని, 150 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, 16,700 మంది టీచర్ ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించామని, రైతులను వేధించిన భూహక్కు చట్టం రద్దు చేశామని మంత్రి పేర్కొన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేయనున్నామని ఆయన తెలిపారు. నవంబరు నుంచి రాజధాని నిర్మాణం శరవేగంగా సాగనుంది. రాష్ట్రంలో అధ్వానంగా మారిన రోడ్లను సరి చేయడం కోసం రూ.400 కోట్లతో టెండర్లు ఖరారు చేశాం. మొదటి దశలో గోతులు పూడుస్తాం. రెండో దశలో పీపీపీ పద్ధతిలో రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. వైసీపీ లిక్కర్ పాలసీపై పిచ్చికుక్కలా మాట్లాడుతోంది. ఐదేళ్లపాటు లిక్కర్‌కు జగన్ సొంత పాలసీ తెచ్చాడు. తానే తయారు చేసి, తానే అమ్మి, తానే రవాణా చేసి, రూ.40 వేల కోట్లు దోచుకున్నాడు. పైగా నాసిరకం లిక్కరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాడు. ఇవాళ కూటమి మంచి లిక్కర్ పాలసీ తెచ్చింది. పారదర్శకంగా ప్రజల ముంగిట లాటరీ తీసి దుకాణాలు అప్పగించిందన్నారు. బుధవారం నుంచి రాష్ట్రంలో 40 రీచ్‌ల నుంచి ఇసుక తవ్వుతున్నాం. అందరికీ అందుబాటులో ఇసుక ఉంటుందన్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గాడిలో పెట్టారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

చీటింగ్..

ఇన్‌స్టా గ్రామ్‌లో నకిలీ యాప్.. రూ.28.30 లక్షలకు టోకరా!

ట్రేడింగ్ పేరుతో సైబర్ వల

మోసపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్‌లో మోసపూరిత యాప్‌తో సైబర్ నేరగాళ్లు ఒక వ్యక్తి నుంచి రూ.28.30 లక్షలు కాజేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణానికి చెందిన జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ కండాల వెంకట ద్వారకా శ్రీనివాస్ షేర్స్ వ్యాపారం చేస్తుంటారు. దీనిలో భాగంగా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో మోతీలాల్ ఆశ్వాల్ ఇనిస్టిట్యూషనల్ అకౌంట్ యాప్‌నకు కస్టమర్ కేర్ సూచనల మేర కు నాలుగు అకౌంట్స్‌కి దఫదఫాలుగా రూ. 28.30 లక్షలు చెల్లించారు. శ్రీనివాస్ తన పేరు మీద షేర్స్‌లో ఉన్న సొమ్ము విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. అయితే షేర్స్‌లో ఉన్న సొమ్ము తన అకౌంట్‌కి బదిలీ కాకపోవడంతో రాజమహేంద్రవరం వెళ్లి మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో యాప్‌కి తమకు సంబంధం లేదని, తమకు ఏ విధమైన యాప్‌లు లేవని, థర్డ్ పార్టీ అకౌంట్స్‌కి సొమ్ము పంపించడం ఉండదని ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. దీంతో శ్రీనివాస్ మోసపోయినట్టు తెలుసుకుని లబోదిబోమన్నాడు. ఈ మేరకు మం గళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నన్నయలో పీజీ ప్రవేశాలకు 17న స్పాట్ కౌన్సెలింగ్

● ఉపకులపతి శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 15: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎంఏ, ఎం.కాం, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 17న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. నన్నయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు 17వ తేదీ ఉదయం 9.30నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని అన్నారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.

కూనవరంలో పెద్ద పులి సంచారం



పెద్ద పులి అడుగుజాడలు

కూనవరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా కూనవరం మండలంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖాధికారులు గుర్తించారు. ఈమేరకు పులి అడుగుజాడలు పరిశీలించారు. కూనవరం రేంజ్ పరిధిలో పోచవరం కాలనీవద్ద ఈ పెద్దపులి అడుగుజాడలు గుర్తించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ తెలిపారు. ఇది వయస్సు ఎక్కువ గల పెద్ద పులి అని పాదముద్రలు గుర్తించినట్లు తెలిపారు. ఈపులి ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి గానీ, పాపికొండల అభయారణ్యం నుంచి గానీ వచ్చినట్లు ఆయన అన్నారు. పులిజాడ కోసం అడవిలో పది ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ పులి జంతువులు, మరెవరికీ గాని హాని తలపెట్టలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులి జాడ కోసం 30 మంది అటవీ సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

లారీ ఢీకొని ఉపాధ్యాయుడి మృతి



కొనకళ్ళ గణేష్ కుమార్

గోపాలపురం, అక్టోబరు 15: ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కొనకళ్ళ గణేష్ కుమార్ అనే ఉపాధ్యాయుడు తీవ్రగాయాల పాలై మృతి చెందిన సంఘటన తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం గ్రామశివారులో మంగళ వారం చోటుచేసుకుంది. ఎస్ఐ కె. సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొనకళ్ళ గణేష్ కుమార్ అనే వ్యక్తి నిడదవోలు మండ లం బ్రహ్మణగూడెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శమిస్రగూడెంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. మంగళవారం సెలవు పెట్టి స్వగ్రామం అయిన బొర్రంపాలెం వెళ్తుండగా గోపాలపురం గ్రామశివారులో ద్విచక్రవాహనంపై వెళుతున్న గణేష్‌కుమార్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో గణేష్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. గాయాలపాలైన గణేష్‌కుమార్ ప్రథమ చికిత్సకోసంగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం రాజమండ్రిలోని బొల్లినేని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. అతని భార్య కొనకళ్ల బేబీ ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



తునిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి మహిళ మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ శివారున జరిగింది. అన్నవరం నుంచి తుని వైపువస్తున్న గుర్తు తెలియని రైలులో ప్ర యాణం చేస్తూ ప్రమాదశాత్తూ జారిపడి ఉంటుందని రైల్వే పోలీసులు భావిస్తున్నా రు. మహిళ వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, పసుపు రంగు పువ్వులు గల డిజైన్‌తో ఉన్న పంజాబీ డ్రస్సు ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఇంకా ఏ విధమైన ఆధారాలు లేకపోవడంతో కేసు నమో దు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువులు ఎవ రైనా ఉంటే తుని రైల్వేస్టేషన్‌లో కానీ, 9490619020లో సంప్రదించాలని కోరారు.

తునిలో కోనసీమ వాసి అనుమానాస్పద మృతి



తునిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు చెందిన వ్యక్తి కాకినాడ జిల్లా తుని పట్టణంలో అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. తు ని పట్టణంలో వీరంకి వారి వీధిలో ఓ ఇంటి సందులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీం తో తుని పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడివద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన అయితాబత్తుల రవికిరణ్(40)గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ప్రమాదశాత్తూ మత్స్యకారుడు మృతి

ఏలేశ్వరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ఏలేశ్వరంలో ప్రమాదవశాత్తూ మత్స్యకారుడు మృతి చెందాడు.. మంగళవారం అప్పనపాలెం వద్ద చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందాడని ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ట్యూబ్ సాయంతో చేపల వేటకు వెళ్లిన గేదే శ్రీను ప్రవాహ వేగానికి అదుపుతప్పి నీటిలో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



రాజమహేంద్రవరంలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, దుర్గేష్, రామానాయుడు, ఎమ్మెల్యేలు

కూటమిగా పనిచేద్దాం.. ఎమ్మెల్సీని గెలిపిద్దాం

అభ్యర్థిని ప్రకటించేలోపు.. గ్రాడ్యుయేట్ ఓటర్లను చేర్పిద్దాం

రాజమహేంద్రవరంలో రౌండ్‌టేబుల్ సమావేశం

మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, పార్టీనేతల స్పష్టీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లోపు జరిగే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమిగా పనిచేసి గెలిపిద్దామని కూటమి నేతలు ప్రతినబూనారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యవేక్షణలో మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సన్నాహక సమావేశంగా ఇది నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎన్నికలో కూటమి అభ్యర్థి గెలవడానికి అందరి సహకారం కావాలన్నారు. అభ్యర్థిని అధినాయకత్వం ప్రకటిస్తుందని తెలిపారు. గ్రాడ్యుయేట్లు అందరినీ నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. రేపటి నుంచే నమోదు కార్యక్రమం మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గోదావరిజిల్లాల ప్రజలు 34 ఎమ్మెల్యేలు, 5 ఎంపీ స్థానాలను ఇచ్చారు. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే మొదటి ఎన్నికలు. ఇది మనకు నల్లేరుమీద నడకే అన్నారు. కానీ అభ్యర్థిని కూడా త్వరగా ఎంపిక చేసేలా అధిష్టానంతో మాట్లాడదామన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాతో సంబంధంలేదు మళ్లీ చేర్పించాలన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయస్ఫూర్తిని ఎమ్మెల్సీ ఎన్నికలో కూడా కొనసాగించాలన్నారు. మేమంతా ఐక్యంగా పనిచేసి, అభ్యర్థి ఎవరైనా సరే గెలిపిస్తామని చెప్పారు. వైసీపీ పోటీ చేయలేమనే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గతంలో వైసీపీ అధికారంలో ఉండగానే విద్యావంతులైన పట్టభద్రులు మూడు ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీకి ఇచ్చారని, ఇక్కడ గెలిచి అదేచరిత్రను కొనసాగించాలన్నారు. బూత్‌స్థాయి నుంచి కమిటీలు వేసి అందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కలసి పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిద్దామన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అందరం ఐక్యంగా అభ్యర్థిని గెలిపిద్దాం అన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఓటర్ల నమోదు చేయించేలోపు అభ్యర్థిని ప్రకటిస్తే మంచిదని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు, చింతమనేని ప్రభాకర్, పంతం నానాజీ, సృజనారంగారావు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ మంత్రి జవహర్, జ్యోతుల నవీన్, రెడ్డి సుబ్రహ్మణ్యం, అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణ, అనంతలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, బూరుగుపల్లి శేషారావు, బీటీఆర్ చౌదరి, ఆది రెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, తోట సుధీర్, అనుశ్రీ సత్యనారాయణ, యర్రా వేణుగోపాల రాయుడు, కాశి రాజు, సత్యనారాయణ, బొమ్ముల దత్తు, రంగబాబు పాల్గొన్నారు.

కోనపాపపేటలో చోరీ

● 15 కాసుల బంగారం, లక్ష నగదు అపహరించిన దొంగలు

కొత్తపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బంగారం, నగదు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు కొత్తపల్లి పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన చింతకాయల జగన్నాథం భవానీ మాల దీక్ష చేపట్టారు. దీక్ష పూర్తిచేసిన అనంతరం కనకదుర్గ మొక్కు చెల్లించుకొనే ఒదుకు కుటుంబ సభ్యులతో సోమవారం విజయవాడ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దొంగలు జగన్నాథం ఇంట్లో చొరబడి బీరువా తాళాలు బద్దలు కొట్టి 15కాసుల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు దోచుకొనిపోయారు. జగన్నాథం విజయవాడ నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో సామాన్లు చిందరవందరగా ఉండటంతో ఇనుప బీరువా తెరిచి చూసేసరికి బంగారం, నగదు కనిపించకపోవడంతో వెంటనే కొత్తప ల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ పి.వెంకటేష్ సిబ్బందితో జగన్నాథం ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పిఠాపురంలో పొట్టేల్ చిత్రం యూనిట్ సందడి

పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పొట్టేల్ చిత్రం హీరో, హీరోయిన్లు, యూనిట్ సభ్యులు

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని మంగళవారం పొట్టేల్ చిత్రం యూనిట్ సందర్శించింది. సినిమాలో హీరో, హీరోయిన్లుగా నటించిన యువ, అనన్య నాగళ్ల, ఆర్టిస్ట్ నోయల్, చిత్ర నిర్మాత నిషాంక్‌లు పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్ర ప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆల య అధికారులు వారిని శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

సందడి చేసిన యూనిట్

పొట్టేల్ చిత్రం యూనిట్ వచ్చిందన్న విషయం తెలుసుకున్న అభిమానులు భారీగా తరలివచ్చారు. వారితో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. పలువురు అభిమానులతో వారు సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్లు యువ, అనన్యలు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో పొట్టేల్ చిత్రం ప్రమోషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని వారు తెలిపారు.



మెగాస్టార్ చిరంజీవిని కలిసిన చంటియ్య, డాక్టరేట్ అందుకుంటున్న చంటియ్య (పాతచిత్రాలు)

సత్యదేవా నర్సరీ అధినేత చంటియ్య మృతి



పుల్లా చంటియ్య (ఫైల్)

కడియం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యదేవా నర్సరీ అధినేత, నర్సరీ సంఘం మాజీ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ(చంటియ్య) (67) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. చంటియ్యకు భార్య, కుమారుడు పెదసత్యనారాయణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చంటియ్య ఆడంబరాలకు దూరంగా ఉండేవారు. కొత్త రకం మొక్కలు సేకరించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన కొన్ని నెలల క్రితం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు దక్కించుకున్నారు. కాగా తండ్రి పుల్లా వెంకట్రావు స్థాపించిన సత్యదేవా నర్సరీని చంటియ్య సోదరులు నాగేశ్వరరావు, అబ్బులు అభివృద్ధి చేశారు. చంటియ్య మృతితో మంగళవారం నర్సరీలు ఎగుమతులు, దిగుమతులు నిలిపివేసి సెలవు ప్రకటించారు. ఆయన మృతికి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, డైరెకర్లు, మార్గాని సత్యనారాయణ, నర్సరీ రైతులు సంతాపం తెలిపారు.

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పీసీఎస్‌వో తనిఖీలు



ఆటోమేటిక్ ఇంటర్ లాకింగ్ పనితీరును పరిశీలిస్తున్న పీసీఎస్‌వో

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్న విషయంపై అలసత్వం వహించవద్దని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెఫ్టీ ఆఫీసర్ (పీసీఎస్‌వో) కె.వెంకటరమణారెడ్డి సూచించారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం మొదలుపెట్టి రాత్రి వరకూ కలియ దిరుగుతూ విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇటీవల చెన్నైలో జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా ఈ ఆడిట్ ఇన్‌స్పెక్షన్ ప్రాధాన్యం సంతరించుకొంది. ఏదో వచ్చామా చూశామా అని కాకుండా ప్రతి అంశాన్నీ సీపీఎస్‌వో నిశితంగా పరిశీలించారు. భద్రతపై పలు సూచనలు చేయడంతో పాటు సాంకేతికంగా వచ్చే ఇబ్బందులు, ముందస్తుగా గుర్తించి తగుచర్యలు తీసుకోవడంపై అధికారులకు, సిబ్బందికి అక్కడికక్కడే కౌన్సెలింగ్ చేశారు. మెము కార్ షెడ్‌ని రెండు గంటలు పరిశీలించారు. ట్రాక్ పాయింట్లు, సిగ్నలింగ్ తదితర చోట్ల నిశితంగా పరిశీలించారు. రోడ్(ట్రాక్) నెం.2లో ఉన్న 49ఏ ఇంటర్ లాకింగ్ జంక్షన్ బాక్స్‌వద్ద తనిఖీచేసి స్వల్ప సాంకేతిక లోపాన్ని గుర్తించి సిబ్బందిని నిలదీశారు. నిధులు, సామగ్రి కొరత ఉందా అని ప్రశ్నించారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే పరిక రాలు ప్రమాణాల ప్రకారం పనిచేసే విధంగా ఉండాలన్నారు. ట్రాక్‌లలోని అన్ని పాయింట్లనూ చెక్ చేశారు. మెడికల్, యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్లలోని పరికరాలను గమనించారు. డిప్యూటీ ఎస్ఎస్ గదిలోని సాంకేతిక వ్యవస్థ పనితీరును పరిశీలించారు. డిప్యూటీ ఎస్ఎస్‌కి లోకో పైలెట్ల(రైలు డ్రైవర్లు)కు మధ్య సమాచార మార్పిడి సవ్యంగా జరుగుతుందా అనే అంశాన్ని గమనించారు. క్రూ లాబీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సీపీఎస్‌వో వెంట సీఈ/టీఎం కృష్ణారెడ్డి, సీవోఎం/జీ/సీవోఎం రవిచందర్, సీఈ/జీఈ విష్ణుకాంత్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ (విజయవాడ) విట్టల్, ఏడీఆర్ ఎం శ్రీనివాస్, ఏడీఈఎన్ చీమల ముత్యాలరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, పీడబ్ల్యూఐ ఎ.రవి, ఎస్ఎంఆర్ రంగనాథ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు



అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం పేరూరు వై.జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లవరం మండలం గోపాయిలంక ప్రాంతానికి చెందిన నిచ్చెనకోళ్ల రాంబాబు (60) అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ పృథ్వి తెలిపిన వివరాల ప్రకారం రాంబాబు తన భార్య రత్నం (54)తో కలిసి అమలాపురం వైపు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. శరవేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టడంతో మోటారు సైకిలిస్టు రాంబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ రత్నంను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

కుమారుడి మృతికి కారణమైన వారిని శిక్షించాలి

● మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా



అపార్టుమెంట్ వద్ద కుమారుడు చరణ్ శ్రీతేజ మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎల్‌బీ నగర్‌లో రాజేశ్వరి రెసిడెన్సీ అపార్టుమెంట్ పైనుంచి పడి మృతి చెందిన కుక్కల చరణ్ శ్రీతేజ (13) మృతికి కారణమైన వారిని శిక్షించి, న్యాయం చేయాలంటూ మృతుని తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, సత్యదేవిలు డిమాండ్ చేశారు. మంగళవారం రాజేశ్వరి రెసిడెన్సీ వద్దకు కుమారుని మృతదేహంతో వచ్చి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. తొలుత ఉసిరి చెట్టు నుంచి కాయలు కోసేందుకు చెట్టుఎక్కి కింద పడిపోయాడని, పోర్టుకో ఎక్కి పడిపోయాడని, మేడపై నుంచి పడిపోయాడంటూ పలు రకాలుగా అపార్టుమెంట్ వాచ్‌మేన్, నివాసితులు చెప్పడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. తమ కుమారుడు ఉదయం 10 గంటలకు బయటకు వెళ్లి ఇంటికి వచ్చి, మరలా గంట తర్వాత బయటకు వచ్చాడని, అపార్టుమెంట్‌లో ఉన్న వాళ్లు తమ కుమారుడ్ని లోపలికి రమ్మని పిలిచి, ఉద్దేశపూర్వకంగా హత్యచేసి ప్రమాదవశాత్తు మృతి చెందాడంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆరోపించారు. తమ కుమారుడు మృతి చెందిన వెంటనే అపార్టుమెంట్ యాజమాని అకస్మాత్తుగా దుబాయ్ వెళ్లిపోయాడని, దీనిపై సమ గ్ర విచారణ నిర్వహించి తమ కుమారుడు మృతికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు ఏసుబాబు, రామకృష్ణమూర్తి, దర్యాప్తు అధికారి ఏఎస్ఐ నాగేశ్వరరావులు ఆందోళనకారులు, అపార్టుమెంట్ వాసులతో చర్చించారు. పోస్ట్‌మార్టమ్ పూర్తయిందని, నివేదిక రాగానే దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని, నివేదిక, విచారణలో హత్య జరిగినట్లు నిర్ధారణ జరిగితే నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి, మృతునికి అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు.

ఒక్కరోజు ఆగి ఉంటే కుమారుడు బతికేవాడు

సోమవారం ఒకరోజు అమ్మమ్మ ఇంటివద్ద ఉంటే తమ కుమారుడు చరణ్ శ్రీతేజ జీవించి ఉండేవాడని తల్లి సత్యవేణి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. దసరా సెలవుల్లో ఆనందంగా గడిపేందుకు తన ఇద్దరు కుమారులతో కలసి పుట్టింటికి రంగంపేట వెళ్లారు. సెలవులు ముగియడంతో సోమవారం ఉదయం కాకినాడ వచ్చారు. ఒక్కరోజు ఉండండి కాకినాడ వెళుదురుగానీ అని అమ్మమ్మ ఎంతగా బ్రతిమాలినా వినిపించుకోలేదు. సెలవులు అయిపోయాయి, స్కూల్‌కి వెళ్లాలంటూ చెప్పి వారించినా వినకుండా ఇంటికి వచ్చేశారు. నీరసంగా ఉందని, సోమవారం స్కూల్‌కి వెళ్లను రేపటి నుంచి వెళతాను అని తల్లి సత్యవేణికి చెప్పాడు.

మద్యం షాపుల సిండికేట్లలో వాటాల పంచాయితీ

గిరిజన లైసెన్సీలు, గిరిజనేతరుల మధ్య సాగుతున్న వివాదం

రంపచోడవరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మన్యంలో మద్యం షాపుల సిండికేట్లలో వాటాల కోసం గిరిజన లైసెన్స్‌లు, గిరిజనేతరుల మధ్య పంచాయితీ సాగుతోంది. మంగళవారం ఈ విషయమై ఆయా షాపుల కేంద్రాలలో పలు సెటిల్మెంట్లు జరిగాయి. ఇక్కడ షాపుల కోసం పాడేరులో లాటరీ తీసేముందు లోపాయికారి ఒప్పందం జరిగాక లాటరీలో షాపు తగిలాక గిరిజనేతరులతో సిండికేట్ అయ్యేదిలేదని గిరిజన లైసెన్స్‌లు కొందరు చెప్పడంతో వివాదం మొదలైంది. దీంతో ఈ వివాదాన్ని సర్దుబాటు చేసుకుని షాపులను పొందాలని గిరిజనేతరులు ప్రయత్నం చేస్తూ తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. వైసీపీ, టీడీపీలు ఎవరికి వారు తమదైన శైలిలో ఈ వివాదాలను పరిష్కరించుకోవాలని చూస్తూ తమవంతు వాటాలను పొందాలని చూస్తున్నారు. ఇక్కడున్న వైసీపీ, టీడీపీ నాయకులు వేయించిన దరఖాస్తులకు లాటరీలు దక్కకపోవడంతో లాటరీల్లో ఊహించని విధంగా మద్యం షాపుల అనుభవం లేని వారికి తగలడంతో వారిని ఏదోరీతిగా ప్రసన్నం చేసుకునే పనిలో ఆయా నేతలు నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల ఒప్పందం ప్రకారం ఎవరికి షాపులు తగిలినా సిండికేట్లో అందరూ వాటాదారులే అన్న ఒప్పందాలను అమలు చేస్తుంటే, మరికొన్నిచోట్ల ఆయా ఒప్పందాలను ఖాతరు చేయని పరిస్థితులే వివాదాలకు కారణమవుతున్నాయి. ఆయా వివాదాలకు రాజకీయ జోక్యంతో పరిష్కారాలు లభిస్తున్నాయి. ఒప్పందంలో ఉన్న వారికి దరఖాస్తులతో చెల్లించిన ఫీజుకు అదనంగా 1లక్ష నుంచి 2లక్షల మధ్య చెల్లించేలా పరి ష్కారాన్ని చూపుతున్నారు. ఏదిఏమైనా వైసీపీ, టీడీపీకి చెందిన నాయ కులు సమన్వయంతోనే ఇక్కడ మద్యం సిండికేట్లను నిర్వహించు కుంటున్నారు.

వివిధ క్రీడల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కాకినాడఅర్బన్, అక్టోబరు 15: వివిధ క్రీడల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో క్రీడాకారుల ఎంపిక డీఎస్ఏ మైదానంలో మంగళవారం నిర్వహించినట్టు స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-14,17 విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్, అండర్-14, 17, 19 విభాగాల్లో మార్షల్ ఆర్ట్స్ అండర్-17 బాలుర వాలీబాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించగా 600మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి రవిసుందర్‌కౌర్ పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయి జట్లకు ఎంపికైన క్రీడాకారులు

హెల్ప్‌లైన్‌తో దోచేశాడు

● 55,999 సొమ్ము వెనక్కి ● సైబర్ క్రైంలో పోగొట్టుకున్న వ్యక్తి

● 10 రోజుల్లో కేసు ఛేదన

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కాజేయడానికి ప్రయత్నించిన సొమ్మును జిల్లా సైబర్ క్రైం పోలీసులు చాకచక్యంగా వెనక్కు రప్పించారు. మల్లికార్జున నగర్‌లో నివాసం ఉంటున్న కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. ఈ నెల 5న కస్టమర్ కేర్ నంబరు గురించి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఓ నకిలీ కస్టమర్ కేర్ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా శ్రీకాంత్‌కి వచ్చిన ఓటీపీని చెప్పారు. అంతే.. క్రెడిట్ కార్డులో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెం.1930 కనెక్ట్ కాకపోవడంతో సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు.. ఆ సొమ్మును ఫ్రీజ్ చేసి పది రోజుల్లో వెనక్కి రప్పించి బాధితుడికి అందజేశారు. కేసులో ప్రతిభ చూపిన సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమా మహేశ్వరరావు, ఎస్ఐ అయ్యప్పరెడ్డి, సిబ్బంది వైఎస్‌వీ సురేశ్, పి.దుర్గా ప్రసాద్, ఎ.అరవింద్‌ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ క్రైం బారిన పడి మోసపోయామని గుర్తించిన వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైం వెబ్‌సైటులో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ విధమైన మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారని స్పందనలో ఫిర్యాదు

అల్లవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లిలో తన రొయ్యల చెరువులకు మత్స్యశాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించడం అన్యాయమని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు వడ్డి జేమ్స్ తెలిపారు. ఎవరో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మత్స్యశాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నానన్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

- అభివృద్ధి పనులకు రూ.5.76 కోట్లు మంజూరు
- వైసీపీ ప్రభుత్వంలో బిల్లుల పెండింగ్‌తో నిలిచిన పనులు
- సిబ్బంది కొరత అంతంత మాత్రమే

ఏరియా ఆసుపత్రిలో నిలిచిన పనులు



మూలన పడి మూలుగుతున్న అత్యాధునిక మంచాలు, ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు



ఏరియా ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన భవనం, అభివృద్ధి లేక మూలనపడ్డ పాత మంచాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రిలో సిబ్బంది కొరత అంతంతమాత్రంగానే ఉంది. వైద్యులు, సిబ్బందితో పాటు అన్నిరకాల మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో ఆసుపత్రి ఆధునికీకరణకు రూ.5.76కోట్లు మంజూరు చేసింది. ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. కొంతమేర పనులు పూర్తి అయిన తర్వాత ప్రారంభోత్సవానికి అప్పటి పాలకులు ప్రయత్నించినా సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు పూర్తిస్థాయిలో పనులు పూర్తి అయిన తర్వాతే ప్రారంభించేలా ఒప్పించారు. అయితే కాంట్రాక్టరుకు అప్పటి జగన్ ప్రభుత్వం బిల్లులు పెండింగ్ పెట్టడంతో అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. దాంతో అప్పటికే కొనుగోలు చేసిన విలువైన ఫర్నిచర్, ఇతర సామగ్రి ఏళ్ల తరబడి మూలన పడి ఉండడంతో తుప్పు పట్టి పాడైపోయే స్థితికి చేరుకున్నాయి. ఆసుపత్రి పై అంతస్తులో అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో సుమారు ఏడాది కాలంగా 40గదులకు వేసిన తాళాలు కూడా తెరవని పరిస్థితి ఉంది. పనులన్నీ పూర్తిచేసి ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రిలో ప్రధానంగా 11 విభాగాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, కంటి విభాగం, ఈఎన్‌టీ, ఎనస్థీషియా, చిన్నపిల్లల వైద్య విభాగం, పేథాలజీ, జనరల్ మెడిసిన్, చర్మవ్యాధులు, డెంటిస్ట్ విభాగాలు ఉండగా ఆయా విభాగాలకు పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఆసుపత్రిలో 24 మంది స్టాఫ్ నర్సులు ఉండాల్సి ఉండగా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. -2020-21లో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడులో భాగంగా ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.5.76 కోట్లు మంజూరు చేసింది. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో 70శాతం పనులు పూర్తిచేసి ఎక్కడి పనులు అక్కడ వదిలేసి కాంట్రాక్టర్లు వెళ్లిపోయారు. ఆసుపత్రిలో 96 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 77 మంది పనిచేస్తున్నారు. 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



మహా ప్రస్థానం వాహనం అవసరం : డాక్టర్ కె.శంకరరావు
ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్



మృతదేహాలను రవాణా చేసేందుకు మహాప్రస్థానం వాహనం అవసరం. ఆసుపత్రికి అంబులెన్సు సౌకర్యం ఉన్నప్పటికీ డ్రైవరు పోస్టును ఇంత వరకు శాంక్షన్ చేయలేదు. ఆసుపత్రిలోనే డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిసలైన వారికి మత్తు విమోచనా కేంద్రం ద్వారా వైద్య సేవలు, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం. 32 సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు ఆసుపత్రిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్నాం.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు రాజోలు విద్యార్థులు



రాజోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడా ఎంపికలు అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు మంగళవారం బట్టేలంక హైస్కూల్‌లో జరిగాయి. ఈఎంపికల్లో రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు కె.సరస్వతి తెలిపారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అండర్-14 బాలుర విభాగంలో గోనమండ ప్రవీణ్‌కుమార్, మల్లాడి ప్రదీప్‌శ్రీశివసాయి, అండర్-17 బాలుర విభాగంలో గుడాల నిఖిల్, గోనమండల నవీన్‌కుమార్, పెమ్మాడి ప్రసన్నకుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ ఐదుగురు విద్యార్థులు ఈనెల 15నుంచి 19వరకు నంద్యాలలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్‌వీఎస్ ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను ఎంపీపీ కేతా శ్రీను జడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ రేవు జ్యోతి, విద్యాకమిటీ చైర్మన్ పెనంగి ఏసుబాబు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు


అల్లవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగతో గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు సాధ్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఓడలరేవు, బెండమూర్లంక, మొగళ్లమూరి, తుమ్మలపల్లి, గోడిలంక, గోడి, గోడితిప్ప, అల్లవరం గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.58లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తుమ్మలపల్లిలో సూర్య స్కూల్ వంట షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే పల్లెల్లో ప్రగతి బాట వేసిందని, సూపర్-6 పథకాలు కూడా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, పీఆర్ డీఈఈ ఎస్.రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీడీవో డీఎస్ఎస్ కృష్ణమోహన్, సర్పంచ్‌లు మల్లాడి మంగాయమ్మ, బర్రే సీతారత్నం, వడ్డి సుభాషిణి-ఎలీషారాజ్, రాయుడు విష్ణుమూర్తులు, రుద్రరాజు పవిత్రలక్ష్మీపతిరాజు, చిట్నీడి శ్రీదేవిశ్రీనివాస్, తోట శ్రీదేవి, బొమ్ము బాలవేణి, యాళ్ల బ్రహ్మానందం, కొల్లు విష్ణుమూర్తి, మంతెన సురేష్‌రాజు, వేగిరాజు సుబ్బరాజు, కంకిపాటి వీరబాబు, వేగిరాజు వెంకట్రాజు పాల్గొన్నారు.

అధ్యాపకుల జీతాల సమస్యపై మంత్రి లోకేశ్‌కు లేఖ

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎంవీఎన్ అండ్ జేఎస్ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు చెల్లించాల్సిన 4నెలల బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, కళాశాల విద్యా రీజనల్ డైరెక్టర్, నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్లకు లేఖలు రాశారు. 35రోజులుగా అధ్యాపకులు సమ్మె చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ విధానంలో భాగంగా కళాశాలను ప్రభుత్వంలో విలీనం చేయడానికి యాజమాన్యం అంగీకరించకపోవడంతో అన్ ఎయిడెడ్ విద్యాసంస్థగా ప్రస్తుతం నడుస్తుందన్నారు. కళాశాలలో600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, 24 మంది అధ్యాపకులతో పాటు నాన్‌టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. అధ్యాపకులకు సీనియారిటీని బట్టి రూ.21వేల నుంచి రూ.8 వేలు జీతంగా చెల్లిస్తున్నారన్నారు. సమ్మె పరిష్కారం కాకపోవడంతో 600మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారని లేఖలో పేర్కొన్నారు. యాజమాన్యం సమ్మె చేస్తున్న అధ్యాపకులతో చర్చలు జరపడం లేదని, జీతాలు చెల్లించడంలేదని, సమస్యను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని మరో పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు.

సమగ్ర శిక్షా సిబ్బంది జీతాలు చెల్లించాలి..

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 25వేల మంది సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ గత ఏడాది డిసెంబరు 19 నుంచి 2024 జనవరి 9 వరకు 22రోజుల పాటు సమ్మె చేశారని ఎమ్మెల్సీలు ఐవీ, లక్ష్మణరావు పేర్కొన్నారు. సమ్మె ముగింపు సందర్భంగా సమ్మెకాలపు జీతం చెల్లింపుతో పాటు ఇతర సమస్యలపై ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకుందన్నారు. సమ్మెకాల జీతాలను చెల్లించాలని శాసన మండలిలో పలు పర్యాయాలు ప్రస్తావించామన్నారు. తక్షణం వారికి జీతాలు చెల్లించాలని, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు.

అంతర్వేది దేవస్థానంలో 'పొలం పిలుస్తోంది'



అంతర్వేది: మాట్లాడుతున్న ఏవో నరసింహారావు

అంతర్వేది, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అంతర్వేది, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో ఏవో పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంట, కొబ్బరి పంటలు, ఈ-పంట నమోదు జాబితాలు ఆయా గ్రామసభల్లో ముసాయిదా కమిటీ జాబితాలను ప్రదర్శించి గ్రామసభలో చదివి వినిపించామన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే రైతులకు తెలియ చేయాలని కోరారు. ఆయా పంటలపై ఎరువులు, పురుగుమందుల వినియోగం, సస్యరక్షణ చర్యలు గురించి వ్యవసాయాధికారి రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పోతురాజు నరసింహారావు(కిశోర్), కొండా జాన్‌బాబు, వడుగు శ్రీనివాస్, ఎంపీటీసీలు భైరా నాగరాజు, చొప్పల బాబూరావు, పోతురాజు కృష్ణ, కొల్లు మహాలక్ష్మి, పిల్లా రాజబాబు, వెటర్నరీ అసిస్టెంట్ రవితేజ, ఉద్యానశాఖ సిబ్బంది కె.కల్యాణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు అవలంభించాలి

అంబాజీపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంభించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. ముక్కామల, కముజువారిలంక గ్రామాల్లో ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో మంగళవారం పొలం పొలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వరిలో వచ్చే తెగుళ్లు, పురుగులు నివారణపై అవగాహన కల్పించారు. పాడి రైతులకు గోకులం షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, సర్పంచ్‌లు సరస్వతుల సుబ్రహ్మణ్యవరప్రసాద్, ఏఈవో డి.దుర్గారావు, రైతులు మానేపల్లి శ్రీనివాసరావు, పిల్లా ఏసు, బొక్కా శ్రీనివాసరావు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షంతో ఇబ్బందులు

ముమ్మిడివరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాలు నీట మునిగాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి 51మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా ముమ్మిడివరం మండలంలో 105.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రాయవరం మండలంలో 16.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అధిక వర్షాలతో మురుగునీటి కాల్వలు, పంట కాల్వలు నీట మునిగాయి. మురుగు కాల్వల వెంబడిఉన్న పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. పలు కాలనీల్లో రోడ్లు నీట మునిగాయి. మంగళవారం ఉదయం నుంచి వర్షం తెరిపివ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ముమ్మిడివరంలో జీఎంసీ బాలయోగి కాలనీ, తహసీల్దార్, సబ్‌ట్రెజరీ, పోలీసుస్టేషన్, వ్యవసాయ, సబ్‌ట్రెజరీ కార్యాలయాల ఆవరణ, ఆసుపత్రి రోడ్డు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్లు నీట మునిగాయి.

చెట్టు మధ్యలో అరటి గెల



ఉప్పలగుప్తం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తొందరపడి ఒక కోయిల ముందే కూసిందా అన్నట్టు అరటి చెట్టు కాండం మధ్య నుంచే గెల వేసింది. సాధారణంగా చెట్టు శివారున మారాకు తొడిగి గెల వేస్తుంది. దీనికి భిన్నంగా గొల్లవిల్లిలో ఒక ఇంటి పెరట్లో అరటిచెట్టు మధ్య భాగం నుంచే గెలవేయడం ఆసక్తికరంగా మారింది.

గృహాల మధ్యలో మద్యం షాపులు పెట్టొద్దు

అంతర్వేది, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో లాటరీ పద్ధతి ద్వారా ప్రారంభించబోయే మద్యం షాపులను నివాసాల మధ్య పెట్టవద్దని అంతర్వేది దేవస్థానం స్థానిక లక్ష్మీనరసింహస్వామి యువత సభ్యులు డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా పాత షాపుల్లో తాత్కాలికంగా మద్యం షాపులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ సీఐ వీరబాబు, స్థానిక సర్పంచ్‌లు, అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వీరబాబు మాట్లాడుతూ ప్రస్తుతం లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపులు ప్రారంభించినా పూర్తిస్థాయిలో లైసెన్సులు వచ్చిన తర్వాత ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకుంటారన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

యానాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి ప్రభుత్వం ఆదిద్రావిడ, షెడ్యూల్ ట్రైబ్ సంక్షేమ శాఖకు సంబంధించి యానాం ప్రాంతానికి చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2024-25ఏడాదికి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని యానాం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రేకాడి కృష్ణమూర్తి తెలిపారు. వీటిలో ప్రీమెట్రిక్, అపర్చునిటీ కాస్ట్, రిటైన్షన్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు ఈనెల28వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా సాయినాధుని ఆరాధనోత్సవాలు



యానాం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యానాం షిరిడి సాయిబాబా ఆలయంలో ఆరాధనోత్సవాలు ఈనెల13వ తేదీ నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈఉత్సవాలు ఈనెల16వరకు నిర్వహిస్తారు.మంగళవారం ఉదయం ఆలయంలో కాకడహారతి, పంచామృతాభిషేకం, పుష్పార్చన, చావడి ఉత్సవం, సాయంత్రం సంధ్యాహారతి, శేజ్ హారతిలను నిర్వహించారు. సాయినాధుడిని భక్తులు దర్శించి పూజలు నిర్వహించారు. యానాం శ్రీషిరిడి సాయి ధార్మిక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో భక్తులు సహకారాంతో ఈనెల20న స్వామివారి ఆలయం ఆవరణలో అన్నసమారాధన నిర్వహించనున్నారు.

18న విజయభేతాళ ఉత్సవం

అంబాజీపేట, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట శ్రీవిజయభేతాళస్వామి ఉత్సవాన్ని ఈనెల18వ తేదీ శుక్రవారానికి మార్పు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జునరావు, శెట్టిబలిజ అభ్యుదయ శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరామారావు తెలిపారు. స్థానిక బేతాళ స్వామి ఆలయం వద్ద మంగళవారం 13పాలాలకు చెందిన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వాతావరణం మార్పుల కారణంగా ఉత్సవాన్ని 18వ తేదీన నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో కార్యదర్శి మట్టపర్తి రాము, దొమ్మేటి సత్యమోహన్, విత్తనాల శేఖర్, దొమ్మేటి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే గిడ్డి


వాకలగరువులో రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అంబాజీపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించనున్న రహదారులకు ఆయన మంగళవారం భూమి పూజ నిర్వహించారు. వాకలగరువులో 5పనులకు రూ.25 లక్షలు, తొండవరంలో 9పనులకు రూ.25లక్షలు, నందంపూడిలో 2పనులకు రూ.9లక్షలు, మాచవరంలో 7పనులకు రూ.49లక్షలు, కె.పెదపూడిలో 3పనులకు రూ.18లక్షలు, చిరతపూడిలో రూ.10లక్షలు, ఇసుకపూడిలో 5పనులకు రూ.20లక్షలు వంతున కేటాయించి ఆయా గ్రామాల్లో ఉపాధి హామీపథకం ద్వారా సీసీ రోడ్లను నిర్మిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంత రహదారులకు మహర్దశ పడు తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవర్, పంచాయతీ రాజ్ జేఈ సీహెచ్ రవి, సర్పంచ్‌లు నాగాబత్తుల శాంతకుమారి, పేరాబత్తుల దొరబాబు, మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, నాయకులు గణపతి వీరరాఘవులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు, కొర్లపాటి గోపి, పేరాబత్తుల రాజు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమంలో ప్రొటోకాల్ రగడ చోటుచేసుకుంది. మండలంలో పలు కార్యక్రమాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి ఫొటోలను ఫ్లెక్సీల్లో ఏర్పాటు చేయకపోవడంపై వారు ఎంపీడీవో జీవీ సరోవర్‌పై అసహనం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్‌ను అధికారులు ఎందుకు పాటించడం లేదని ఎంపీడీవో సరోవర్‌ను ఎంపీపీ నిలదీశారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ హెచ్చరించారు. ఇదిలా ఉండగా మాచవరం సీసీ రోడ్లు శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎదుట టీడీపీ, జనసేన నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. మాచవరం గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.49లక్షలను సీసీ రోడ్లకు నిధులు కేటాయించారు. అయితే ఈనిధులను మాచవరంలో రూ.30లక్షలు కొర్లపాటివారిపాలానికి రూ.10లక్షలు మంజూరు చేయడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. కొర్లపాటివారిపాలానికి చెందిన కొర్లపాటి గోపి తమకు రూ.10లక్షలు కేటాయించడంపై ఎమ్మెల్యే ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు రహదారులు నిర్మించే విషయంపై స్పష్టత లేదని, ఇకపై ఇటువంటి విభేదాలు లేకుండా చూస్తానని తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రాణేలంకలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

ముమ్మిడివరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలను రైతుల ముంగిటకు తీసుకువచ్చేందుకే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా వనరుల కేంద్రం సహాయ, వ్యవసాయ సంచాలకుడు ఏవీఎస్ రాజశేఖర్ అన్నారు. రాణేలంక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్, పళ్లవారిపాలెం రైతుసేవా కేంద్రంలో సర్పంచ్ చిక్కం వెంకటపద్మజ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్ మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వరి పంటపై బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఆశించినట్టు తమ పరిశీలనలో వెల్లడైందన్నారు. సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన తుఫాను, వర్షాలు, అధిక ఎండలకు, నత్రజని అధికంగా వాడిన పొలాలకు ఈతెగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. కొబ్బరి చెట్ల నీడలో వరి పంటను ఆశించి చీడ అంతా వ్యాపిస్తుందన్నారు. తెగులు నివారణకు నత్రజని ఎరువు వాడకాన్ని నిలిపివేయాలని, పొలంలో ఉన్న మురుగునీటిని బయటకు తొలగించాలని, పైరు అంకురం ఏర్పడే దశలో ఎకరాకు 15 నుంచి 20 కిలోల పొటాష్ ఎరువును వేసుకోవాలన్నారు. తెగులు వ్యాప్తిని అరికట్టేందుకు ఎకరానికి ప్లాంటోమైసిన్ 100 గ్రాములు, క్లాపరాక్సీక్లోరైడ్ 450 గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే వారం రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారీ చేసుకోవాలనారు. ఈ మందులో తెగుళ్ల మందు గానీ, పురుగుమందు గానీ కలుపరాదన్నారు. దోమ పోటు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ఉద్యానవన విస్తరణాధికారి పద్మ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పిడుగులు పడడం, పురుగుల వల్ల తెగుళ్ల సోకి గానీ కొబ్బరిచెట్లు చనిపోతే వాటిని తొలగించి కొత్త చెట్లు పెంచుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో జె.మనోహర్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి


భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు

అమలాపురం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో ఏపీజే అబ్దుల్‌కలాం చిత్రపటానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ బషీర్, అరిగెల తేజ, ఫిరోజ్, హుస్సేన్, కరీముల్లాబాబా, షరీఫ్, ఆలీ, షఫీ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతిని ఎంపీపీ కేతా శ్రీను ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి ఎంపీపీ కేతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, ఈవోపీఆర్డీ జి.భీమారావు, ఏవో ఎం.సత్యనారాయణ, సెక్రటరీ రెహ్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరం సీహెచ్‌సీలో అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతి ఘనంగా జరిగింది. ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసిన పండ్లు, పాలును ఆసుపత్రి సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు, సహచర వైద్యులు రోగులు అందించి కలామ్ చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.

మామిడికుదురు: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆయన చిత్రపటాలను గీశారు. పెన్సిల్‌తో ఆయన చిత్రాలను గీసి ప్రదర్శించారు. చిత్రపటాలను గీసిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా, డ్రాయింగ్ మాస్టారు బత్తుల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ఉద్యోగులను తొలగిస్తే ఆందోళన

కాట్రేనికోన, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో 2019తర్వాత నియమించిన ఉద్యోగులను తొలగిస్తే ఆందోళన చేస్తామని సంఘాల యూనియన్ హెచ్చరించింది. ఉద్యోగుల వయోపరిమితిని 62ఏళ్లకు పెంచాలని, జీవో నెం.36 ప్రకారం వేతన సవరణ చేసి జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేసింది. మంగళవారం నుంచి నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తూ, ఈనెల21న కాకినాడ డీసీసీబీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని జిల్లా యూనియన్ గౌరవ అధ్యక్షుడు నూకల బలరామ్, అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా కోశాధికారి బొబ్బా రామసుబ్రహ్మణ్యచౌదరి, ఉపప్రధాన కార్యదర్శి మట్టపర్తి జయరామ్ అన్నారు.

సన్నవిల్లి మాజీ సర్పంచ్ మృతి



ఉప్పలగుప్తం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సన్నవిల్లి మాజీ సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకుడు గనిశెట్టి వీరాస్వామినాయుడు(75) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు.ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాణిజ్య విభాగం రాష్ట్రఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి మృతదేహంపై తెలుగుదేశం జెండా కప్పి నివాళులర్పించారు.

గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా : ఎమ్మెల్యే దేవ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మలికిపురం, కత్తిమండ, రామరాజులంక, దిండి గ్రామాల్లో పల్లె పండుగ సందర్భంగా పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మలికిపురంలో సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గాన్ని గత పాలకులు అన్ని రంగాల్లోను నిర్లక్ష్యం చేశారని అన్నారు. గత పాలకులు రాజోలు నియోజకవర్గానికి అవసరం లేనప్పటికీ రూ.143కోట్లతో భవనాలు నిర్మించారని, అవన్నీ అసంపూర్తిగా మొండి గోడలతో ఎదురు చూస్తున్నాయని ఆరోపించారు. రాజోలు నియోజకవర్గంలో 60గ్రామాలకు రూ.11కోట్లతో 206రోడ్లు నిర్మిస్తున్నామని, సంక్రాంతి నాటికి పూర్తి అవుతుందని చెప్పారు. అవినీతికి తావు లేకుండా ప్రజాభీష్టం మేరకు ముందుకు వెళుతున్నానని అన్నారు. మలికిపురం, కత్తిమండ, లక్కవరం, రామరాజులంక, దిండి గ్రామాల్లో కొత్త రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సర్పంచ్‌లు గెడ్డం రాజ్యలక్ష్మి, ఆరేటి రంగ, కోట పుష్పకుమారి, కాకర శ్రీనివాస్, ముదునూరి శ్రీనివాసరాజు, ఎంపీటీసీలు కె.సీతామహలక్ష్మి, జక్కంపూడి శ్రీదేవి, చిట్టాల శ్రీను, కాకి లక్ష్మణ్, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణి, అడబాల యుగంధర్, పినిశెట్టి బుజ్జి, జంపన సత్యనారాయణరాజు, తహసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీవో బాలాజీ, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

కార్తీక మాస ఉత్సవాలపై సమీక్ష

ఐ.పోలవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో జరిగే కార్తీక ఉత్సవాలపై మంగళవారం సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ సమీక్ష నిర్వహించారు. నవంబరు రెండో తేదీ నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈకార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున తగిన ఏర్పాట్లు చెయ్యాలని సిబ్బందికి సూచించారు. అభిషేక పూజలు తిలకించేందుకు మండపాల వద్ద ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రూ.3,000 టిక్కెట్టు తీసుకున్న భక్తులకు నెల రోజులు నిజరూప లింగానికి పంచామృతాభిషేకంనిర్వహిస్తామన్నారు. నవంబరు 15రాత్రి జ్వాలాతోరణం, అమావాస్యనాడు దీపోత్సవం నిర్వహిస్తామన్నారు. దాట్ల రామకృష్ణంరాజు, పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, నాగభట్ల కృష్ణమూర్తి, గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, నాగభట్ల రవిశర్మ పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై గురువారం ఉదయం 11నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు.

ఇంటి కప్పుపై కూలిన చింతచెట్టు

రాజోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సోంపల్లి పల్లిపాలెంలో రేకుల షెడ్డు ఇంటిపై చింతచెట్టు కూలడంతో మంగళవారం ఇల్లు ధ్వంసమైంది. రెండు రోజులుగాకురుస్తున్న వర్షాల వల్ల పొన్నమండ సత్యనారాయణకు చెందిన రేకు షెడ్డు ఇంటిపై భారీ చింత వృక్షం విరిగి పడిపోయింది. దీంతో ఇంటి పైకప్పు గోడలు ధ్వంసమయ్యాయని సత్యనారాయణ కుటుంబ సభ్యులు వాపోయారు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలు, ఇద్దరు పెద్దలు ఉన్నారు. అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సంఘటనా స్థలాన్ని వైస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పరిశీలించారు.

చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారని స్పందనలో ఫిర్యాదు

అల్లవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లిలో తన రొయ్యల చెరువులకు మత్స్యశాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించడం అన్యాయమని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు వడ్డి జేమ్స్ తెలిపారు. ఎవరో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మత్స్యశాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో మూడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నానన్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీటీసీ మధ్య వాగ్వివాదం


ఎమ్మెల్యే వేగుళ్ళను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ మధు

వాడీవేడిగా కపిలేశ్వరపురం మండల సమావేశం

కపిలేశ్వరపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో 2014లో గత ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గోకులం రైతుకు బిల్లులు ఎలా మంజూరు చేసారంటూ వైసీపీ ఆ గ్రామ ఎంపీటీసీ మండల విప్ పలివెల మధు పశుసంవర్ధక శాఖ అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జోక్యం చేసుకుని అప్పుడు మా ప్రభుత్వ హయాంలోనే కదా జరిగింది, అప్పుడు ఏం చేసారంటూ ఎమ్మెల్యే వేగుళ్ళ ఎంపీటీసీ మధును ప్రశ్నించారు. దీనిపై ఎంపీటీసీ మాట్లాడుతూ మీరు ఎన్ని సమావేశాలకు హాజరయ్యారంటూ ఎమ్మెల్యేను నిలదీయడంతో మీకు చెప్పాల్సిన పనిలేదంటూ ఎంపీటీసీపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరి మధ్య సమావేశంలో కొద్దిసేపు వివాదం చోటుచేసుకుంది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడీగా జరిగింది. ఈసమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ళ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీవో కె.రత్నకుమారి శాఖల వారీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు జరగాల్సిన సమావేశానికి ఎంపీపీ సత్యవేణి సకాలంలో రాకపోవడాన్ని వల్లూరు, కపిలేశ్వరపురం సర్పంచ్‌లు దాసి మీనాకుమారి, సాకా శ్రీనివాస్ ఎంపీడీవోను ప్రశ్నించారు. అనంతరం ఎంపీపీ 11.10గంటలకు హాజరయ్యారు. ఆరు నెలలుగా నేలటూరు గ్రామానికి విద్యుత్ లైన్‌మెన్ లేక ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని సర్పంచ్ కె.వీరన్న కోరారు. ఎన్ని సమావేశాలకు హాజరయ్యారంటూ ఎంపీటీసీ మధు ఎమ్మెల్యేను ప్రశ్నించడంపై వల్లూరు సర్పంచ్ దాసి మీనాకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగర పీహెచ్‌సీ ఆవరణలో దాతల సహకారంతో నిర్మించిన అదనపు భవనంలో వైద్యుల కొరత లేకుండా భర్తీ చేయాలని గ్రామ ఎంపీటీసీ అడ్డాల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. అచ్యుతాపురం పీహెచ్‌సీలో ఈసీజీ పనిచేయడం లేదని, వైద్య పరీక్షలు కూడా సరిగా జరగడం లేదని ఎంపీటీసీ మధు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతులు పండించిన ధాన్యాన్ని తోలుకునే విషయంలో పూర్తి సమాచారాన్ని అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా రైతులకు వివరించాలని ఎమ్మెల్యే వేగుళ్ళ ఏవో రమేష్‌కు సూచించారు. పాఠశాలల్లోని నాడే-నేడు పనులు, వాటి పరిస్థితులపై పూర్తి సమాచార్ని ఇవ్వాలని ఎమ్మెల్సీ తోట ఆర్‌డబ్ల్యుఎస్ అధికారికి సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, తహసీల్దార్ చిన్నారావు, మండల పరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు: బండారు


ఆత్రేయపురంలో రూ.18లక్షలతో నిర్మించనున్న రహదారికి శంకుస్థాపన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆత్రేయపురం, ఉచ్చిలి, వసంతవాడ, తాడిపూడి, కట్టుంగ గ్రామాల్లో సుమారు రూ.కోటి 20లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన నిర్వహించారు. జగన్ ప్రభుత్వం పాలనలో అభివృద్ధి లేక గ్రామాలు అంధకారంలో ఉన్నాయని, ఇప్పుడు పండుగలా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, క్లస్టర్ ఇన్‌చార్జులు ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కంఠంశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ గెడ్డం సుధ, తోటకూర సుబ్బరాజు, దండు రాంబాబు, భీమరాజు, దొడ్డపనేని వెంకట్రావు, కరుటూరి రవి, ఎంపీడీవో రామన్, పంచాయతీరాజ్ జేఈ భద్రరావు, ఆర్ఐ సునీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎండకు ఎండి.. వానకు తడిసి


దేవరపల్లి హైస్కూలు వద్ద రహదారి చెంతనే విద్యార్థులు పార్కింగ్ చేసిన సైకిళ్లు

సైకిళ్ల పార్కింగ్ ఇబ్బందులు

రావులపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సమీప గ్రామాల నుంచి చదువుకునేందుకు పాఠశాలకు వస్తున్న విద్యార్థుల సైకిళ్ల పెట్టుకునేందుకు సరిపడిన షెడ్డు లేకపోవడంతో ఆ సైకిళ్ల ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. రావులపాలెం మండలం దేవరపల్లి జడ్పీ పాఠశాలకు సమీప గ్రామాల నుంచి విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలకు వస్తారు. గతంలో సైకిళ్లను పార్కింగ్ చేసేందుకు షెడ్డు నిర్మించినప్పటికీ అది సరిపోకపోగా అనువుగా లేకపోవడంతో విద్యార్థులు రహదారి చెంతనే తమ సైకిళ్లను పార్కింగ్ చేస్తున్నారు. ఎండ సమయంలో వేడికి టైర్లలో గాలి తగ్గిపోయిన పాఠశాల వదిలిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానాకాలం వర్షంలో తడిసిపోవడంతో సైకిళ్ల తుప్పు పట్టి పాడైపోతున్నాయంటూ పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైకిళ్లను పార్కింగ్ చేసుకునేందుకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు



ముమ్మిడివర్రాడు ప్రధాన రహదారి గోతుల్లో చేరిన వర్షం నీరు

రావులపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రహదారులు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో వర్షం వస్తే చాలు చెరువులను తలపిస్తున్నాయి. ముమ్మిడివరప్పాడు ప్రధాన రహదారి, గోపాలపురం జాతీయ రహదారి సెంటర్ నుంచి ఈతకోట గంటి రోడ్డు వరకు విస్తరించి ఉంది. ఈరహదారిలో అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీని ఆధునికీకరణ విషయాన్ని పాలకులకు పట్టకపోవడంతో ఛిద్రమైంది. ఈరహదారిపై ఏర్పడ్డ గోతులు కారణంగా ద్విచక్ర వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే చాలు రహదారిపై ఉన్న గోతుల్లోకి నీరు చేరి చెరువులను తలిపించే విధంగా మారుతోంది. ఆ గోతుల్లో ద్విచక్ర వాహనాల టైర్ల వరకు మునిగిపోతున్నాయి. గ్రామ ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో చేరిన నీటిని మళ్లించేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదభరితంగా పరిస్థితి మారింది. అదే విధంగా దేవరపల్లి రహదారితో పాటు పలు రహదారులు ఛిద్రమయ్యాయి.

లొల్ల పీహెచ్‌సీకి 9 సెంట్ల స్థలం అందజేత


మంత్రి సత్యకుమార్‌కు స్థలం పత్రాలు అందిస్తున్న దాత ముళ్లపూడి రామకృష్ణ

రాయవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లొల్ల గ్రామానికి చెందిన ముళ్లపూడి రామకృష్ణ గ్రామంలో నిర్మించే ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 9 సెంట్ల స్థలాన్ని మంగళవారం ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌కు అందజేశారు. విజయవాడ బీజేపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన వారధి కార్యక్రమంలో రామకృష్ణ స్థలానికి సంబంధించిన పత్రాలు అందజేశారు. లొల్ల గ్రామ సర్పంచ్ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకిరాంబాబు అవసరమైన చర్యలు తీసుకుని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చొరవతో పీహెచ్‌సీ ఏర్పాటుకు మార్గం సుగమం అయిందన్నారు. దాతను మంత్రి అభినందించారు. ఆసుపత్రి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రిని కోరినట్లు దాత మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా దాతను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అభినందించారు.

వైభవంగా అయ్యప్పల పడిపూజ


అయ్యప్ప కలశాల పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలోనున్న శ్రీగౌతమి అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం 54 కలశల పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు కలశా లను చేతబట్టి వీధుల్లో ర్యాలీగా అయ్యప్ప సంకీర్తనలు పాడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కారుపర్తి కోటేశ్వరరావు పడిపూజ నిర్వహించగా ప్రకాష్ గురుస్వామి భజన సంకీర్తన నిర్వహించారు. అనంతరం మద్దింశెట్టి ప్రసాద్ గురుస్వామి స్వాములకు పడిపూజ ఏర్పాటు చేశారు.

బైక్ దొంగ అరెస్ట్

జగ్గంపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం ఉదయం సీడీ డీలక్స్ బండిని దొంగలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జగ్గంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కేసుకు సంబంధించిన సీసీపుటేజ్ పరిశీలించగా ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన తుహుకుల రామదాసుగా గుర్తించారు. దర్యాప్తుచేపట్టిన పోలీసులు జగ్గంపేట నుంచి గోకవరం రోడ్డు వెళుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేశారు. బైక్‌పై నిందితుడు ప్రయాణిస్తుండగా మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. బైకును స్వాధీనం చేసుకుని, కేసునమోదుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ఈకేసును 24గంటల్లో చేధించిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునాధరావును, పోలీసు బృందాన్ని పలువురు అభినందించారు.

గృహాల మధ్యలో మద్యం షాపులు పెట్టొద్దు

అంతర్వేది, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లాటరీ పద్ధతి ద్వారా ప్రారంభించబోయే మద్యం షాపులను నివాసాల మధ్య పెట్టవద్దని అంతర్వేది దేవస్థానం స్థానిక లక్ష్మీనరసింహస్వామి యువత సభ్యులు డిమాండ్ చేశారు. పాత షాపుల్లో తాత్కాలికంగా మద్యం షాపులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ సీఐ వీరబాబు, సర్పంచ్‌లు, అధికారులకు ఫిర్యాదులు చేశారు.


యర్రపోతవరంలో కాలువలోకి దూసుకెళ్లిన ట్రావెల్ బస్సు

అదుపు తప్పిన ట్రావెల్ బస్సు

కె.గంగవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల నుంచి యానాం వస్తున్న ట్రావెల్ బస్సు యర్రపోతవరం వంతెన సమీపంలో అదుపుతప్పి కాలువ వైపునకు దూసుకెళ్లింది. కాలువ ఒడ్డున చెట్టు ఉండటంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవరు, ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. స్థానికుల సాయంతో బస్సును వెనక్కు తీశారు.

18న విజయభేతాళ ఉత్సవం

అంబాజీపేట, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట శ్రీవిజయబేతాళస్వామి ఉత్సవాన్ని ఈనెల18వ తేదీ శుక్రవారానికి మార్పు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జునరావు, శెట్టిబలిజ అభ్యుదయ శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి వెంకట రామారావు తెలిపారు. స్థానిక బేతాళస్వామి ఆలయం వద్ద మంగళవారం 13పాలాలకు చెందిన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వాతావరణం మార్పుల కారణంగా ఉత్సవాన్ని 18వ తేదీన నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో కార్యదర్శి మట్టపర్తి రాము, దొమ్మేటి సత్యమోహన్, విత్తనాల శేఖర్, దొమ్మేటి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

అమలాపురం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈ నెల 17వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను సెల్ 9581932678కు ఫోన్ ద్వారా తెలియచేయాలని ఆయన కోరారు.

మూలనపడిన ఆర్వో ప్లాంట్

- నీరుగారిన దాతల ఆశయం
- మూడేళ్లకే మూలన పాడేశారు
- మరమ్మతులు చేయించడానికి నిధులు కొరత


తాగునీరు కోసం బోరుబావి వద్ద క్యూకట్టిన విద్యార్థులు


మూలన పడిన ఆర్వో ప్లాంటు

కొత్తపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్షిత మంచినీరు అందించే ఉద్దేశంతో హైదరాబాద్‌లో స్థిరపడిన కొత్తపేట వాసి దెందులూరి నలినిమోహన్-పద్మ దంపతులు తమ తండ్రి దెందులూరి వైద్యనాథ కృష్ణమూర్తి-శంకుతల జ్ఞాపకార్థం 2019లో రూ.లక్షల వ్యయంతో ఉన్నత పాఠశాలకు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఏర్పాటు చేసిన మూడేళ్లకే దానిని మూలనపాడేశారు. దీంతో దాతల ఆశయం నీరుగారింది. దీనిని ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో విద్యార్థులు తాగునీరు కోసం పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఒక్క బోరుపైనే ఆధారపడి తాగునీరుకు కొట్టిమిట్టాడుతున్నారు. దీనిపై హెచ్‌ఎం ఆర్.రామకృష్ణను వివరణ కోరగా దాతలు ఇచ్చిన ఆర్వో ప్లాంటు రిపేరు కారణంగా మూసివేశామని రిపేర్ చేయించడానికి నిధులు లభ్యత లేవన్నారు. దీనిపై ఎంఈవో హరిప్రసాద్‌ను వివరణ కోరగా ఆర్వో ప్లాంటును పరిశీలించి తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పాలా ల్యాబ్స్ వినియోగం పెంచాలి


పాలా ల్యాబ్ వినియోగం పరిశీలిస్తున్న మధుసూదనరావు

ద్రాక్షారామ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గణితం, ఇంగ్లీషులో మెళకువలు సులభంగా నేర్చుకునేందుకు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పాలా ల్యాబ్స్‌ను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునేలా పర్యవేక్షించాలని సమగ్ర శిక్షాభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఏ.మధుసూదనరావు సూచించారు. మంగళవారం ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో పాలా ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రతీ విద్యార్థి పాలా ల్యాబ్‌ను వినియోగించుకునేలా గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. తొలెత పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన హసన్‌బాద జడ్పీ ఉన్నత పాఠవాల, ఎస్‌బీజీ మున్సిపల్ ఉన్నత పాఠ శాలను సందర్శించారు. ఈసందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ జిల్లాలో తొలి దశలో 21, రెండో దశలో 5 పాఠశాలలు పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికయ్యాయని తెలిపారు. ప్రతీ పాఠశాలకు ఆట స్థలం అభివృద్ధికి రూ.5లక్షలు వంతున మంజూరు అయినట్లు వివరించారు. జిల్లాలో ఏడు కెమిస్ట్రి ల్యాబ్‌లకు రూ.1.09 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. పాఠశాలల్లో పీఎంశ్రీ నిధులు వినియోగంపై హెచ్‌ఎంలు పి.బి.ఎస్.కె.సుందరి, మాదవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏఎంవో పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం


కపిలేశ్వరపురంలో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం ప్రత్యేక లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం కోరుమిల్లి, కపిలేశ్వరపురం, అచ్యుతాపురం, వల్లూరు, అద్దంకివారి లంక గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆయన మండపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి సీసీరోడ్లు, డ్రైన్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌నిధులు రూ.1.77కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్స్ వంటి 39 పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. వెదురుమూడిలో రూ.25లక్షలతో చేపట్టనున్న 5పనులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదనివిమర్శించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ, జనసేన ఇన్‌చార్జ్ లీలాకృష్ణలను పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు ఆచంట సత్యనారాయణ, సాకా శ్రీనివాస్, రెడ్డి సుజాత ప్రసాద్, దాసి మీనాకుమారి, ఈశ్వరరావు, కూటమి నాయకులు, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి శ్రీరాంజీ, బలవరెడ్డి సత్తిబాబు, పుత్సల శ్రీనివాస్, కొప్పిశెట్టి వాసు, పలువురు ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు కొండలరావు, కె.శివచక్రవర్తి, సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


వాడపల్లి వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.2,11,048 లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు. అన్న ప్రసాద ట్రస్టుకు జంగారెడ్డిగూడేనికి చెందిన పరిమి సత్యనారాయణ రూ.50 వేలు విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.


సత్యవాడలో భారీ వర్షానికి నేల కొరిగిన వరి పొలాలు

భారీ వర్షం.. నేల వాలిన వరి పొలాలు

కె.గంగవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. పెద్ద పెద్ద ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో వరి పొలాలు పడిపోయాయి. ప్రస్తుతం వరి పొలాలు ఈనిక దశలో ఉన్నాయి. ఈ దశలో పొలాలు నేలకొరిగితే దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చెట్లు ఉన్న ప్రాంతాల్లో ఎకరాకు 10 సెంట్లు నెల పరిధిలో పొలాలు పడిపోయాయి. దీంతో ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాలు దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీవో రాజు

పారిశుధ్య నిర్వహణలో రాజీపడొద్దు

ఆలమూరు, అక్టోబరు 15: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో రాజీపడొద్దని డీఎల్‌డీవో, ఈవోపీఆర్డీ ఎ.రాజు సూచించారు. చొప్పెల్లలో మంగళవారం ఆయన పర్యటించి పారిశుధ్యం నిర్వహణ, చెత్త సేకరణపై సమీక్షించి పలు సూచనలు అందించారు. గ్రామంలో తాగునీటి ట్యాంకులను పరిశీలించి క్లోరినేషన్‌పై పంచాయతీ సిబ్బందితో చర్చించారు. ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడకుండా పంచాయతీ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయరెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

21నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు


శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అందిస్తున్న డిప్యూటీ కమిషనర్ చక్రధరరావు

ఆత్రేయపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల21 నుంచి 29వరకు ఘనంగా నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలు తిరుమల తరహాలో నిర్వహించనున్నారు. మంగళవారం బ్రహ్మోత్సవ తొలి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు అందజేశారు. పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులకు ఆహ్వానాలను పంపిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనర్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

కొత్తపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఒక బాలికను ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేసిన ఘటనలో బాలిక ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వరసాల కృష్ణబాబు అనే యువకుడు కొబ్బరికాయల వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే అతను ఓ బాలికను ప్రేమ పేరుతో మోసంచేసి అత్యాచారం చేసినట్టు బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై డీఎస్పీ వై.గోవిందరావు విచారణ జరిపి మంగళవారం నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.

రావులపాలెం ఆర్ఐగా సుజాత



రావులపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రావులపాలెం తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పి.సూర్య కాంతం (సుజాత) బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇప్పటి వరకు కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రావులపాలెం బదిలీపై వచ్చారు. దీంతో మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కె.గంగవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీబాషా పిలుపునిచ్చారు. స్మార్ట్‌ఫోన్లకు అన్‌వాంటెడ్ లింకులు వస్తే వాటిని టచ్ చేయరాదని కోరారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడన్నారు. బిట్ కాయిన్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ఎవరైనా ఫోన్‌లో ఆఫర్ చేస్తే వాటిని నమ్మకూడదన్నారు. ముఖ్యంగా వర్క్ ఫ్రం హోం పేరుతో మహిళలను టార్గెట్ చేస్తున్నారని అలాంటి మోసపూరిత ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా నేరం జరిగితే 1930 నెంబరకు సమాచారం ఇవ్వాలని, నేరం జరిగిన రెండు గంటల్లోపు తెలియజేస్తే పోయిన సొమ్ము రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.